# పెన్ పవర్

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రకటన కర్తలకు, పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

CELEBRATING 11TH YEAR ANNIVERSARY

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 62 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కడప | శనివారం 8 నవంబర్ 2025 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 62 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED :KADAPA | SAT 8 NOVEMBER 2025 | PRICE : 5/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta, Bapatla, Ongole, Visakhapatnam, Kakinada, Circulated by :Srikakulam, manyam, Vizianagaram, East Godavari, West Godavari, Eluru, Guntur, SPSR Nellore, Tirupati, Chittor, Kurnool, Anantapur


## బ్యాంకుల ప్రైవేటీకరణ సరైనదే..
# జాతీయాకరణతో ఒరిగిందేం లేదు



పెన్ పవర్ డెస్క్:కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణను మరింత ముందుకు తీసుకెళ్లాలని తాజాగా ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. అలా చేయడం వల్ల జాతీయ ప్రయోజనాలు దెబ్బతినవని స్పష్టంగా తెలిపారు. ఢిల్లీ యూనివర్సిటీలోని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వజ్రోత్సవ ముగింపు సభలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన ఆమె.. 1969లో జరిగిన బ్యాంకుల జాతీయం అనుకున్నంత మేలు చేయలేకపోయిందని వ్యాఖ్యానించారు. జాతీయాకరణ వల్ల ప్రభుత్వ పథకాలు, ప్రాధాన్య రంగాలకు రుణసదుపాయం వంటి కార్యక్రమాలకు ఊతమొచ్చింది. అయితే ప్రభుత్వ నియంత్రణలో వ్యవస్థ అనర్థంగా, అప్రొఫెషనల్‌గా మారిందని సీతారామన్ చెప్పారు. 50 ఏళ్ల జాతీయాకరణ తర్వాత కూడా లక్ష్యాలు సరిగా నెరవేరలేదని చెప్పుకొచ్చారు ఆర్థిక మంత్రి. కానీ బ్యాంకులను ప్రొఫెషనల్‌గా నిర్వహించడం ప్రారంభించిన

వివరాలు 2లో..



## అనంతపురం జిల్లాలో మంత్రి నారా
# లోకేశ్ కు ఘనస్వాగతం

- అనంతపురం జిల్లాలో మంత్రి లోకేశ్ రెండు రోజుల పర్యటన ప్రారంభం
- పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న మంత్రికి ఘన స్వాగతం
- స్వాగతం పలికిన వారిలో మంత్రి పయ్యావుల, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- రోడ్డు మార్గంలో కళ్యాణదుర్గం బయలుదేరిన నారా లోకేశ్
- దారి పొడవునా ప్రజలను పలకరించి అర్జీలు స్వీకరణ
- ధర్మవరంలో గజమాలతో స్వాగతం పలికిన తెలుగు యువత

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అనంతపురం జిల్లాలో తన రెండు రోజుల పర్యటనను శుక్రవారం ప్రారంభించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకు న్నారు. అక్కడ ఆయనకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీ నారాయణ సహా ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా

వివరాలు 2లో..

## ఏపీకి పెట్టుబడుల వెల్లువ...
## రూ. లక్ష కోట్ల ప్రాజెక్టులకు
# ఎస్ఐపీబీ ఆమోదం



- ఏపీకి భారీగా తరలివస్తున్న పెట్టుబడులు
- 12వ SIPB సమావేశంలో కీలక నిర్ణయాలు
- మొత్తం రూ.1,00,099 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం
- ఈ పెట్టుబడుల ద్వారా 84,030 మందికి ప్రత్యక్ష ఉపాధి
- వివిధ రంగాల్లో 26 కొత్త పరిశ్రమల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- ఏఎమ్‌జీ మెటల్స్, ఇండిచిప్ సెమీ కండక్టర్స్ నుంచి భారీ పెట్టుబడులు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌కు పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో జరిగిన 12వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం, రూ. 1,01,899 కోట్ల విలువైన 26 పారిశ్రామిక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది.

వివరాలు 2లో..

## మెగా సిటీలుగా ఆ మూడు నగరాలు...
# మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి

- రూ.1,01,899 కోట్ల విలువైన 26 పరిశ్రమలకు రాష్ట్ర పెట్టుబడుల బోర్డు ఆమోదం
- ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో 85,570 మందికి ఉపాధి అవకాశాలు
- గత 16 నెలల్లో మొత్తం రూ. 8 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్న ప్రభుత్వం
- ప్రాజెక్టులు క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులకు సీఎం ఆదేశం
- విశాఖ, అమరావతి, తిరుపతిలను మెగా సిటీలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయం
- ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో భారీ పెట్టుబడుల సదస్సు నిర్వహణకు సన్నాహాలు



పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో జరిగిన 12వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం, రూ. 1,01,899 కోట్ల విలువైన 26 పారిశ్రామిక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. ఈ భారీ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 85,570 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

**అధికారులకు సీఎం కీలక ఆదేశాలు**

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. "రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు వచ్చేలా చూడటం అధికారుల బాధ్యత. పెట్టుబడిదారుల నుంచి ప్రతిపాదనలు తీసుకుని సమయం వృథా కాకుండా తక్షణం ఆమోదం తెలియచేయాలి. ప్రభుత్వం నుంచి ఆమోదం పొందిన పరిశ్రమలు, ప్రాజెక్టులు క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చేలా (గ్రౌండ్ అయ్యేలా) చూసే బాధ్యతను అధికారులు తీసుకోవాలి. పెట్టుబడులు పెట్టే పరిశ్రమల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలి" అని ఆయన ఆదేశించారు.

గత ప్రభుత్వ హయాంలో భూములు కేటాయించినా ఇప్పటికీ ప్రారంభం కాని ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించాలని, నిర్మాణంలో పురోగతి లేకపోతే వాటి



అనుమతులు రద్దు చేయాలని సీఎం తేల్చిచెప్పారు. భవిష్యత్తులో ఎలక్ట్రానిక్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని, చిప్, సెమీ కండక్టర్లు, డ్రోన్ల తయారీ వంటి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు

వివరాలు 2లో..

## వందేమాతరం ఒక మంత్రం..
# తరతరాలకు స్ఫూర్తి

- వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాలను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఈ సందర్భంగా స్మారక నాణెం, పోస్టల్ స్టాంపును ఆవిష్కరించిన ప్రధాని
- వందేమాతరం దేశ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని వ్యాఖ్య
- దేశవ్యాప్తంగా ఏడాది పాటు కొనసాగనున్న వేడుకలు
- పౌరులు తమ గళంతో వందేమాతరం పాడి పంపేందుకు డిజిటల్ పోర్టల్ ప్రారంభం

వివరాలు 2లో..



## ఎన్నికల చోరీల ద్వారా
## మోదీ ప్రధాని అయ్యారు
## ఈ విషయాన్ని జెన్ జీ యువతకు వివరిస్తా

- మోదీ ఎన్నికలు దొంగిలించి ప్రధాని అయ్యారని రాహుల్ సంచలన ఆరోపణ
- ఈ నిజాన్ని దేశ యువతకు ఆధారాలతో వివరిస్తానని ప్రకటన
- నకిలీ ఓట్లు, నకిలీ ఫొటోలతో బీజేపీ మోసాలకు పాల్పడుతోందని విమర్శ
- ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించడం లేదని ఆక్షేపణ
- మోదీ, అమిత్ షా, ఈసీ కలిసి రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:నరేంద్ర మోదీ ఎన్నికల చోరీలతో ప్రధానమంత్రి పదవిలోకి వచ్చారంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ వ్యవస్థీకృతంగా ఎన్నికల చోరీలకు పాల్పడుతోందని, ఈ నిజాన్ని దేశ యువత (జెన్ జీ) ముందు ఆధారాలతో సహా ఉంచుతానని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన 'హెచ్-ఫైల్స్' మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ, "మా దగ్గర చాలా ఆధారాలున్నాయి. ఈ ప్రక్రియను మేం

వివరాలు 2లో..

## ఏపీలో తెలంగాణకు చెందిన
## 'ప్రీమియర్ ఎనర్జీస్' వేల కోట్ల పెట్టుబడి

- సోలార్ రంగంలో ఏపీకి తరలివచ్చిన భారీ పెట్టుబడి
- రూ.5,942 కోట్లతో పరిశ్రమ ఏర్పాటు చేయనున్న ప్రీమియర్ ఎనర్జీస్
- నెల్లూరు జిల్లా నాయుడుపేటలో సోలార్ సెల్, వేఫర్ తయారీ ప్లాంట్
- ప్రత్యక్షంగా 3,500 మందికి ఉద్యోగ అవకాశాలు
- రికార్డు సమయంలో 269 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం
- దేశంలోనే కీలక సోలార్ తయారీ హబ్‌గా ఏపీ



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక రంగంలోకి మరో భారీ పెట్టుబడి తరలివచ్చింది. తెలంగాణకు చెందిన ప్రముఖ సౌరశక్తి పరికరాల తయారీ

వివరాలు 2లో..

## ఏసీఏ కీలక నిర్ణయం.. విశాఖ స్టేడియంలోని
## ఒక వింగ్‌కు శ్రీ చరణి పేరు

- ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని కీలక ప్రకటన
- శ్రీ చరణికి రూ. 2.5 కోట్ల నగదు, గ్రూప్ 1 ఉద్యోగం
- కడపలో ఇంటి స్థలం కేటాయింపుపై సీఎం హామీ
- త్వరలో మహిళా క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేస్తామన్న ఏసీఏ
- ఉండవల్లిలో సీఎం చంద్రబాబుతో శ్రీ చరణి భేటీ



పెన్ పవర్ డెస్క్:వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్ సభ్యురాలైన ఆంధ్రప్రదేశ్ మహిళా క్రికెటర్ శ్రీ చరణికి అరుదైన గౌరవం దక్కింది. విశాఖపట్నంలోని క్రికెట్ స్టేడియంలో ఒక వింగ్‌కు ఆమె పేరు

వివరాలు 2లో..

## శ్రీచరణికి ఏపీ సర్కార్ భారీ నజరానా...
## రూ. 2.5 కోట్లు, గ్రూప్-1 ఉద్యోగం

- మహిళల ప్రపంచకప్ విజేత శ్రీచరణిపై ఏపీ ప్రభుత్వం వరాల జల్లు
- రూ. 2.5 కోట్ల నగదు, గ్రూప్-1 ఉద్యోగం, కడపలో ఇంటి స్థలం ప్రకటన
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో భేటీ అయిన శ్రీచరణి, మిథాలీ రాజ్
- గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికిన మంత్రులు, ఏసీఏ పెద్దలు
- కడపలో శ్రీచరణికి ఘన సన్మానం.. భారీ ర్యాలీకి ఏర్పాట్లు

పెన్ పవర్ డెస్క్:మహిళల వన్డే ప్రపంచకప్ లో అద్భుత ప్రదర్శనతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించిన తెలుగమ్మాయి, క్రికెటర్ శ్రీచరణిపై ఏపీ ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. ఆమెకు రూ. 2.5 కోట్ల నగదు బహుమతి, గ్రూప్-1 స్థాయి ప్రభుత్వ ఉద్యోగం,



వివరాలు 2లో..

## పరకామణి దోషులకు
# జైలు తప్పదు
## కరుణాకర్ రెడ్డిపై భానుప్రకాశ్ రెడ్డి ఫైర్

- శ్రీవారి ఖజానాను కరుణాకర్ రెడ్డి అండ్ కో దోచుకున్నారన్న భానుప్రకాశ్ రెడ్డి
- దొంగలతో లోకాయుక్తలో రాజీ చేస్తారా అని ప్రశ్న
- బహిరంగ చర్చకు రావాలని కరుణాకర్ రెడ్డికి సవాల్

పెన్ పవర్ డెస్క్:టీటీడీ పరకామణి కేసులో దోషులు కచ్చితంగా జైలుకు వెళతారని, శ్రీవారి ఖజానాను దోచుకున్న మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి, ఆయన బృందాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి



వివరాలు 2లో..

## ఆ నిర్ణయం వెనక్కి
## తీసుకునేదాకా ఉద్యమం



- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వైసీపీ
- ఈనెల 12న రాష్ట్రవ్యాప్తంగా నిరసన ర్యాలీలకు నిర్ణయం
- కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి పిలుపు
- నిరసన ర్యాలీల పోస్టర్‌ను విడుదల చేసిన నేతలు
- జగన్ తెచ్చిన కాలేజీలపై కక్ష సాధింపు తగదన్న అంబటి

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# బాబు చెబుతున్నది రైతులు అర్థం చేసుకుంటున్నారా ?

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు గత కొంతకాలంగా రైతులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. రైతాంగం మేలు కోరుతూనే ప్రజల ఆరోగ్యం కూడా దృష్టిలో పెట్టుకుని ఆయన సూచనలు చేస్తున్నారు. కేవలం అధిక దిగుబడి మాత్రమే లక్ష్యం కాకుండా ఇతర విషయాలు కూడా పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం కోరుతోంది. నిజానికి వ్యవసాయ పద్ధతులు చాలా కాలంగా మారిపోయాయి. రసాయన ఎరువులు వాడుతున్నారు. అది అవసరం అనివార్యం అని అంటున్నారు. అయితే పండించిన పంట మార్కెట్ కూడా చేయాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో అందరికీ అవసరం అయిన రసాయన ఎరువులు సరఫరాలో తేడా వస్తే రైతులు ఆందోళన చేస్తున్నారు.

**సేంద్రియ విధానం :**

రైతులు తమ పంటలలో సేంద్రీయ ఎరువులు వాడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా సభలు సమావేశాలలో చెబుతూ వస్తున్నారు. తాజాగా ఆయన ఆచార్య ఎన్ జీ రంగా జయంతి వేడుకల సందర్భంగా విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో మరోసారి ఇదే విధమైన హిత బోధ చేశారు. రైతులు సేంద్రీయ వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు పంటలకు సేంద్రీయ ఎరువులను మాత్రమే వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

**కొన్ని దేశాలు నో :**

ఏపీ నుంచి ఇతర దేశాలకు పంటలు ఎగుమతి చేయాలంటే వారు తీసుకోవడానికి ఇష్టపడటం లేదని చంద్రబాబు కీలక అంశాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. మనం పండించిన పంటలను కొన్ని దేశాలు దిగుమతి చేసుకోవడానికి ఇష్టపడటం లేదు అని ఆయన చెప్పుకొచ్చాఉర్. అందుకు కారణం రసాయన ఎరువుల వాడకమే అని ఆయన అసలు విషయం చెప్పారు. అందువల్ల రైతులు సేంద్రియ విధానంలోకి మారాలని ఆయన సూచించరు. అంతే కాదు మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల మార్పిడి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్భోదించారు.

**రైతుల పక్షమే :**

ఏపీలో కూటమి ప్రభుత్వం రైతుల పక్షమే ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాట ధర కల్పిస్తున్నామని చెప్పారు. అదే విధంగా డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ ఇస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీని కూడా ఇస్తున్నామని, మిగిలిన వారికి 50 నుంచి 90 శాతం సబ్సిడీ ఇస్తున్నామని ఆయన వివరించారు. కౌలు రైతులు అధైర్య పడొద్దని ఆత్మహత్యలు చేసుకోవద్దని బాబు కోరారు. వారిని కూడా కూటమి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని బాబు వెల్లడించారు.

**సీమలో కొత్త సీన్ :**

ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కరవు మీద ప్రత్యేక దృష్టి పెట్టి దాదాపుగా దానిని నిర్మూలించే విధంగా చర్యలు తీసుకున్నామని చంద్రబాబు చెప్పారు. సమర్ధ నీటి నిర్వహణతో పాటు, ముందస్తు చర్యల వల్ల రిజర్వాయర్లు 95 శాతం నిండాయని బాబు చెప్పారు. అయితే గత ప్రభుత్వంలో రిజర్వాయర్ల గేట్లను కూడా నిర్వహించలేకపోయారని ఆయన విమర్శించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో జలాశయాలను పూర్తిచేశామని చెప్పారు అలాగే రాయలసీమలో కరువును జయించామని వెల్లడించారు.

# బ్యాంకుల ప్రైవేటీకరణ సరైనదే.. జాతీయీకరణతో ఒరిగిందేం లేదు

- మొదటి పేజి తరువాయి

తర్వాత వాటి లక్ష్యాలు మరింత ఫలవంతంగా నెరవేరుతున్నాయన్నారు.

ప్రైవేటీకరణతో సామాజిక లక్ష్యాలు సడలిపోతాయని ఉన్న అభిప్రాయాన్ని ఖండిస్తూ ఆమె.. బ్యాంకులు ప్రొఫెషనల్‌గా మారినా లేదా ప్రైవేటు రంగంలోకి వెళ్లినా, ప్రజలందరికీ బ్యాంకింగ్ సేవలు అందించాలనే లక్ష్యం దెబ్బతింటుందనే మాట సరైంది కాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె గతంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు ఎదుర్కొన్న 'ట్విన్ బెలెన్స్ షీట్' సమస్యను ప్రస్థావించారు. 2012%-%13లో ఏర్పడిన ఆర్థిక సమస్యలను సరిదిద్దడానికి తాము చాలా కాలం కష్టపడాల్సి వచ్చిందన్నారు. బోర్డు ఆధారిత నిర్ణయాలతో నడిచే ప్రొఫెషనల్ బ్యాంకులు జాతీయ ప్రయోజనాలను, వ్యాపార ప్రయోజనాలను సమర్థవంతంగా సాధించగలవని ఆమె అన్నారు. అయితే నిర్మలమ్మ వ్యాఖ్యలపై బ్యాంకు యూనియన్లు తీవ్రంగా స్పందించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులే దేశానికి విస్తృత స్థాయి బ్యాంకింగ్ సేవలను అందించగలిగాయని, ప్రజలు పెద్ద స్థాయిలో జన్ ధన్ అకౌంట్లు తెరవడం, రైతులకు, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు రుణ సదుపాయాలు కల్పించడం వంటివి వీరి ద్వారానే సాధ్యమైందని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజెన్ నగర్ పేర్కొన్నారు.

# ఏపీకి పెట్టుబడుల వెల్లువ... రూ. లక్ష కోట్ల ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం

- మొదటి పేజి తరువాయి

ఈ భారీ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 85,570 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత 16 నెలల కాలంలో జరిగిన 12 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా రాష్ట్రానికి మొత్తంగా రూ. 8,08,899 కోట్ల పెట్టుబడులు, 7,05,870 ఉద్యోగాలు రానున్నాయని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు.

**12వ SIPB సమావేశంలో ఆమోదించిన పెట్టుబడుల పూర్తి వివరాలు:**

1. రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ - రూ.202 కోట్లు - 436 మందికి ఉద్యోగాలు.
2. ఎపిటోమ్ కాంపోనెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.700 కోట్లు - 1,000 మందికి ఉద్యోగాలు.
3. NPSPL అడ్వాన్స్ మెటీరియల్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.2,081 కోట్లు - 600 మందికి ఉద్యోగాలు.
4. క్రయాన్ టెక్నాలజీ లిమిటెడ్ - రూ.1,154 కోట్లు - 1500 మందికి ఉద్యోగాలు.
5. SCIC వెంచర్స్ ఎల్ఎల్‌పీ - రూ.550 కోట్లు - 1130 మందికి ఉద్యోగాలు.
6. ఇండిచిప్ సెమీ కండక్టర్స్ లిమిటెడ్ - రూ.22,976 కోట్లు - 1241 మందికి ఉద్యోగాలు.
7. ఫ్లూయింట్‌గ్రిడ్ లిమిటెడ్ - రూ.150 కోట్లు - 2,000 మందికి ఉద్యోగాలు.
8. మథర్సన్ టెక్నాలజీ సర్వీస్ లిమిటెడ్ - రూ.110 కోట్లు - 700 మందికి ఉద్యోగాలు.
9. క్వార్ట్జ్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.115 కోట్లు - 2000 మందికి ఉద్యోగాలు.
10. కె.రహేజా కార్ప్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.2,172 కోట్లు - 9,681 మందికి ఉద్యోగాలు.
11. విశాఖ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.2,200 కోట్లు - 30 వేల మందికి ఉద్యోగాలు.
12. ఐ స్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.119 కోట్లు - 2,000 మందికి ఉద్యోగాలు.
13. %బాూజుూ% సోలార్ పీ12 ప్రైవేట్ లిమిటెడ్ - రూ.1728 కోట్లు - 860 మందికి ఉద్యోగాలు.
14. నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ - రూ.7972 కోట్లు - 2,700 మందికి ఉద్యోగాలు.
15. మైరా బే వ్యూ రిసార్ట్స్ - రూ.157 కోట్లు - 980 మందికి ఉద్యోగాలు.
16. విశ్వనాథ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.51 కోట్లు - 750 మందికి ఉద్యోగాలు.
17. సుగ్నా స్పాంజ్ అండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.1247 కోట్లు - 1,100 మందికి ఉద్యోగాలు.
18. సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్ - రూ.8570 కోట్లు - 1000 మందికి ఉద్యోగాలు.
19. వాల్టన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.1682 కోట్లు - 415 మందికి ఉద్యోగాలు.
20. ఏఎమ్‌జీ మెటల్స్ అండ్ మెటీరియల్స్ లిమిటెడ్ - రూ.44,000 కోట్లు - 3000 మందికి ఉద్యోగాలు.
21. వాసంగ్ ఎంటర్‌ప్రైజ్ - రూ.898 కోట్లు - 17,645 మందికి ఉద్యోగాలు.
22. బిర్లాను లిమిటెడ్ - రూ.240 కోట్లు - 588 మందికి ఉద్యోగాలు.
23. సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ - రూ.1,090 కోట్లు - 1250 మందికి ఉద్యోగాలు.
24. భారత్ డైనమిక్స్ - రూ.489 కోట్లు - 500 మందికి ఉద్యోగాలు.
25. డాజ్కో ప్రైవేట్ లిమిటెడ్ - రూ.1234 కోట్లు - 1454 మందికి ఉద్యోగాలు.
26. శ్రీవేదా ఇన్నోవేషన్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.12 కోట్లు - 1500 మందికి ఉద్యోగాలు.

# మెగా సిటీలుగా ఆ మూడు నగరాలు... మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి

- మొదటి పేజి తరువాయి

ప్రత్యేకంగా ఎలక్ట్రానిక్ పార్క్ ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో 15 పారిశ్రామిక జోన్లు ఏర్పాటు చేసి, క్లస్టర్ల వారీ విధానంతో పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించి, పెట్టుబడులు చేజారకుండా చూడాలన్నారు. "కేంద్రం ఇచ్చే ప్రోత్సాహకాలు ఆలస్యమైనా, రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి ఇవ్వాల్సినవి వెంటనే అందించి పరిశ్రమలను నిలబెట్టాలి" అని సీఎం స్పష్టం చేశారు. పారిశ్రామిక అవసరాల కోసం ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధంగా ఉంచాలని, ప్రైవేటు భూ యజమానులు పరిశ్రమలకు భూములిచ్చేందుకు ముందుకొస్తే వారిని ప్రోత్సహించాలని తెలిపారు.

**మూడు మెగా సిటీలు... మాస్టర్ ప్లాన్లు**

రాష్ట్రంలో మూడు మెగా సిటీలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యాన్ని సీఎం పునరుద్ఘాటించారు. "అనకాపల్లి నుంచి విజయనగరం వరకు విశాఖను, అలాగే అమరావతి, తిరుపతి నగరాలను మెగా సిటీలుగా అభివృద్ధి చేయాలి. అమరావతికి ఇప్పటికే మాస్టర్ ప్లాన్ ఉంది. విశాఖ, తిరుపతిలకు కూడా వెంటనే మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. ఈ నగరాలను టూరిజం, ఐటీ సహా వివిధ పరిశ్రమలకు కేంద్రాలుగా తీర్చిదిద్దాలి" అని సీఎం అన్నారు. మున్సిపల్, పరిశ్రమలు, ఐటీ, పర్యాటక శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ నగరాలను నివాసయోగ్యంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సూచించారు. గూగుల్ డేటా సెంటర్ రాకతో విశాఖకు మరిన్ని కంపెనీలు రానున్నాయని, వాటికి అవసరమైన భూ లభ్యత ఉండేలా చూడాలని ఆదేశించారు. రాష్ట్రంలో మూడు ఎకనామిక్ కారిడార్లు ఏర్పాటు కానున్న నేపథ్యంలో, వాటి అభివృద్ధిని పర్యవేక్షించేందుకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమిస్తామని ప్రకటించారు.

**పెట్టుబడుల సదస్సును ఘనంగా నిర్వహించాలి**

ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న పెట్టుబడుల సదస్సును అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఎస్ఐపీబీ ఆమోదించిన పరిశ్రమలకు వెంటనే శంకుస్థాపనలు చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సహా ఇతర మంత్రులు వివిధ జిల్లాల్లో ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటామని తెలిపారు. తాను ఇటీవల జరిపిన విదేశీ పర్యటనల్లో పలువురు పారిశ్రామికవేత్తలను సదస్సుకు ఆహ్వానించానని, వారు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు, సదస్సుకు హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేశారని వివరించారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు సీఎంకు తెలిపారు.

ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, టీజీ భరత్, నారాయణ, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వందేమాతరం ఒక మంత్రం.. తరతరాలకు స్ఫూర్తి

భారత జాతీయ గీతం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏడాది పాటు జరిగే ఉత్సవాలను ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు ఘనంగా ప్రారంభించారు. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన వందేమాతరం స్మారక నాణెం, పోస్టల్ స్టాంపును ఆవిష్కరించారు. ఈ గీతం దేశ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని, తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉందని ప్రధాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "నవంబర్ 7 ఒక చారిత్రకమైన రోజు. వందేమాతరం 150 ఏళ్ల మహోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ పవిత్ర సందర్భం కోట్లాది మంది భారతీయులలో కొత్త స్ఫూర్తిని, శక్తిని నింపుతుంది. వందేమాతరం అనేది కేవలం ఒక పదం కాదు, అది ఒక మంత్రం, ఒక శక్తి, ఒక కల, ఒక సంకల్పం. ఇది మనల్ని మన చరిత్రతో అనుసంధానిస్తుంది. మన ఆత్మవిశ్వాసాన్ని పెంచి, మనం సాధించలేని కల ఏదీ లేదని గుర్తుచేస్తుంది" అని తెలిపారు. మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన వీరులకు ఆయన నివాళులర్పించారు. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సంగ్రామానికి స్ఫూర్తినిచ్చిన గీతాన్ని స్మరించుకోవడం గర్వంగా ఉందన్నారు. "ప్రాణత్యాగం చేసిన వేలాది మంది స్వాతంత్ర్య సమరయోధులు చివరిగా పలికిన మాట వందేమాతరం అయి ఉంటుంది. వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడానికి భారతీయులందరినీ ఏకం చేయగల శక్తి వందేమాతరానికి ఉంది" అని ఆయన అన్నారు. పౌరులు తమ గళంతో వందేమాతరం పాడి పంపేందుకు ఒక డిజిటల్ పోర్టల్‌ను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు.

ఈ వేడుకల్లో భాగంగా ఉదయం 9:50 గంటలకు దేశవ్యాప్తంగా ప్రజలు ఉన్నచోటనే సామూహికంగా వందేమాతరం పూర్తి గీతాన్ని ఆలపించారు. పాఠశాలలు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో పౌరులు ఉత్సాహంగా పాల్గొని ఢిల్లీలోని ప్రధాన కార్యక్రమంతో గొంతు కలిపారు.

**చారిత్రక నేపథ్యం**

1875 నవంబర్ 7న అక్షయ నవమి పర్వదినాన బంకించంద్ర ఛటర్జీ ఈ గీతాన్ని రచించారు. ఆయన రాసిన ప్రఖ్యాత నవల 'ఆనందమఠం'లో భాగంగా ఈ గీతం తొలిసారిగా 'బంగదర్శన్' అనే పత్రికలో ప్రచురితమైంది. మాతృభూమిని శక్తికి, సౌభాగ్యానికి ప్రతీకగా వర్ణించిన ఈ గీతం, అనతికాలంలోనే భారత స్వాతంత్ర్య ఉద్యమానికి, ముఖ్యంగా స్వదేశీ ఉద్యమానికి ప్రధాన నినాదంగా మారింది. భాషా, ప్రాంతీయ భేదాలను అధిగమించి జాతీయ చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. 19వ శతాబ్దపు బెంగాల్ మేధావులలో ఒకరైన బంకించంద్ర ఛటర్జీ ఆధునిక భారత జాతీయవాద స్ఫూర్తిని రగిలించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ ఉత్సవాలు 2026 నవంబర్ 7 వరకు కొనసాగుతాయి.

# ఆ నిర్ణయం వెనక్కి తీసుకునేదాకా ఉద్యమం

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 12వ తేదీన రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో భారీ నిరసన ర్యాలీలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. 'కోటి సంతకాల' సేకరణ కార్యక్రమాన్ని కూడా చేపట్టి, ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో నిరసన ర్యాలీలకు సంబంధించిన పోస్టర్‌ను పార్టీ నేతలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు, టీజేఆర్ సుధాకర్ బాబు, దొంతిరెడ్డి వేమారెడ్డి, మనోహర్ రెడ్డి, వంగవీటి నరేంద్ర, చంద్రశేఖర్ రెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. "మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలనే నిర్ణయం చాలా దురదృష్టకరం. మాజీ సీఎం జగన్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన మెడికల్ కాలేజీలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష కట్టడం సరికాదు" అని అన్నారు. ప్రభుత్వ నిర్ణయం పేద విద్యార్థులకు వ్యతిరేకంగా ఉందని ఆయన ఆరోపించారు. "ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు మా ఉద్యమం కొనసాగుతుంది. ఇందులో భాగంగానే కోటి సంతకాల సేకరణ చేపడుతున్నాం. ఈ నెల 12న అన్ని నియోజకవర్గాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించి కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపిస్తాం" అని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.

# ఏపీలో తెలంగాణకు చెందిన 'ప్రీమియర్ ఎనర్జీస్' వేల కోట్ల పెట్టుబడి

- మొదటి పేజి తరువాయి

సంస్థ 'ప్రీమియర్ ఎనర్జీస్' ఏపీలో రూ.5,942 కోట్ల భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చినట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. నెల్లూరు జిల్లాలోని నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్క్‌లో ఈ మెగా సోలార్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 4 గిగావాట్ల సామర్థ్యంతో టాప్‌కాన్ సోలార్ సెల్ యూనిట్, 5 గిగావాట్ల సిలికాన్ ఇంగాట్ మరియు వేఫర్ తయారీ ప్లాంట్‌ను నిర్మించనున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో రాష్ట్రంలో ప్రత్యక్షంగా సుమారు 3,500 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని, అనుబంధ పరిశ్రమల ద్వారా పరోక్షంగా మరిన్ని ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని లోకేశ్ తెలిపారు. ఈ ప్రాజెక్టుకు భూ కేటాయింపుల ప్రక్రియను ప్రభుత్వం రికార్డు వేగంతో పూర్తి చేసిందని ఆయన వివరించారు. 2024 అక్టోబర్‌లో కంపెనీ ప్రతినిధులతో చర్చలు ప్రారంభం కాగా, కేవలం కొద్ది నెలల్లోనే, అంటే 2025 ఫిబ్రవరి నాటికి ఏపీఐఐసీ ద్వారా 269 ఎకరాల భూమిని కేటాయించినట్లు పేర్కొన్నారు. ఓడరేవులకు సమీపంలో ఉండటం, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, అనుకూల పారిశ్రామిక విధానాల వల్లే ప్రీమియర్ ఎనర్జీస్ ఏపీని ఎంచుకుందని తెలిపారు. ఈ పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఒక ముఖ్యమైన సోలార్ తయారీ కేంద్రంగా (హబ్) మారనుందని లోకేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ ప్లాంట్ సామర్థ్యాన్ని 7 గిగావాట్లకు పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. భారతదేశంలో రెండో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ సోలార్ సెల్, మాడ్యూల్ తయారీదారు అయిన 'ప్రీమియర్ ఎనర్జీస్'కు ఏపీకి స్వాగతం పలుకుతున్నామని, ఈ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి, యువతకు హరిత ఉద్యోగాల కల్పనకు ఎంతగానో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

# ఎన్నికల చోరీల ద్వారా మోదీ ప్రధాని అయ్యారు

- మొదటి పేజి తరువాయి

కొనసాగిస్తాం. నరేంద్ర మోదీ ఎన్నికలను ఎలా దొంగిలించి ప్రధాని అయ్యారో జెన్ జీ యువతకు స్పష్టంగా వివరిస్తాం. బీజేపీ ఎన్నికలను దొంగిలిస్తోంది. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదు" అని తీవ్రంగా విమర్శించారు. నకిలీ ఓట్లు, ఓటర్ల జాబితాలో నకిలీ ఫొటోలు వంటి అంశాలపై తాను చేసిన ఆరోపణలకు ఎన్నికల సంఘం (ఈసీ) నుంచి ఎలాంటి స్పందన రాలేదని రాహుల్ అన్నారు. బీజేపీ ఈసీని వెనకేసుకొస్తోందని, కానీ తాము చేసిన ఆరోపణలను మాత్రం ఖండించడం లేదని ఆయన పేర్కొన్నారు. తాము చూపుతున్న ఆధారాలన్నీ ఈసీ నుంచి సేకరించినవే అని తెలిపారు. ఓటర్ల జాబితాలో బ్రెజిల్‌కు చెందిన లారిస్సా నెరీ అనే మహిళ ఫొటోను చేర్చడం ఒక చిన్న ఉదాహరణ మాత్రమేనని రాహుల్ అన్నారు. "అసలు సమస్య నరేంద్ర మోదీ, అమిత్ షా, ఎన్నికల సంఘం కలిసి రాజ్యాంగంపై దాడి చేస్తుండటం. ఒకే వ్యక్తి బహుళ ఓట్లు వేయడం, ఒకే బూత్‌లో ఒక మహిళకు 200 ఫొటోలు ఉండటం వంటివి జరుగుతున్నాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, గుజరాత్‌లలో ఇది జరిగింది. ఇప్పుడు బీహార్‌లోనూ అదే చేయబోతున్నారు" అని రాహుల్ ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో బ్రెజిల్ మహిళ లారిస్సా నెరీ కూడా ఒక వీడియో ద్వారా స్పందించారు. "భారత్‌లో ఎన్నికల కోసం ఎవరో నా పాత ఫొటోను వాడుకుంటున్నారు. అది నేను 18-20 ఏళ్ల వయసులో ఉన్నప్పటి ఫొటో. నన్ను భారతీయురాలిగా చూపి ప్రజలను మోసం చేస్తున్నారు" అని ఆమె తన వీడియోలో పేర్కొన్నారు.

# శ్రీచరణికి ఏపీ సర్కార్ భారీ నజరానా... రూ. 2.5 కోట్లు, గ్రూప్-1 ఉద్యోగం

- మొదటి పేజి తరువాయి

సొంత జిల్లా కడపలో 1,000 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఏపీ సీఎంఓ ట్వీట్ చేసింది. అలాగే మంత్రి లోకేశ్ కూడా ఈ విషయమై 'ఎక్స్' వేదికగా ప్రత్యేకంగా పోస్టు పెట్టారు. "శ్రీచరణి అచంచల అంకితభావం ఆంధ్రప్రదేశ్‌ను గర్వపడేలా చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆమె అద్భుతమైన విజయాన్ని గ్రూప్-1 ప్రభుత్వ ఉద్యోగం, రూ. 2.5 కోట్ల నగదు బహుమతి, కడపలో నివాస స్థలంతో సత్కరిస్తుందని ప్రకటించడానికి సంతోషంగా ఉంది" అంటూ మంత్రి లోకేశ్ పోస్ట్ చేశారు. అంతకుముందు శ్రీచరణి, మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌తో కలిసి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో శ్రీచరణిని అభినందించిన చంద్రబాబు, ప్రపంచకప్ గెలిచి దేశానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంసించారు. మహిళా క్రీడాకారులకు శ్రీచరణి ఆదర్శంగా నిలిచారని, ఎంతోమందికి స్ఫూర్తినిస్తారని కొనియాడారు. ప్రపంచకప్ గెలిచిన ఆనంద క్షణాలను శ్రీచరణి సీఎం, మంత్రితో పంచుకున్నారు.

ఈ సందర్భంగా శ్రీచరణి మాట్లాడుతూ... ప్రపంచకప్ గెలిచిన తర్వాత దేశ ప్రజలు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ప్రజలు చూపిస్తున్న అభిమానానికి చాలా సంతోషంగా ఉందని తెలిపారు. తన కుటుంబం అందించిన ప్రోత్సాహమే తనను ఈ స్థాయికి తీసుకొచ్చిందని, ముఖ్యంగా తన మామ తనను క్రికెట్ ఆడేందుకు ఎంతగానో ప్రోత్సహించారని గుర్తుచేసుకున్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో శిక్షణ పొందానని చెప్పారు. ఈ విజయం మొదటి అడుగు మాత్రమేనని, భవిష్యత్తులో మరిన్ని లక్ష్యాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీని కలిసినప్పుడు ఆయన భవిష్యత్ కార్యాచరణపై విలువైన సలహాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఇక, ఇవాళ సాయంత్రం కడపలో ఏసీఏ, కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీచరణికి భారీ సన్మాన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# పరకామణి దోషులకు జైలు తప్పదు

- మొదటి పేజి తరువాయి

తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. దొంగను దాతగా, దొంగతనాన్ని కానుకగా మార్చిన వారు ఇప్పుడు నీతిమంతుల్లా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భానుప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

పరకామణిలో జరిగిన అక్రమాలపై కరుణాకర్ రెడ్డి అండ్ కో సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని భానుప్రకాశ్ రెడ్డి ధ్వజమెత్తారు. "పరకామణి విషయంలో దొంగలను వెంటబెట్టుకుని లోకాయుక్తకు వెళ్లి కరుణాకర్ రెడ్డి ఎలా రాజీ చేస్తారు? ఆనాడు దీనికి సంబంధించిన తీర్మానాలపై సంతకాలు చేసింది మీరు కాదా?" అని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ వ్యవహారంపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

"శ్రీనివాసుడు ఇప్పుడు ఉగ్ర నరసింహుడిగా మారారు. తన ఖజానాకు కన్నం వేసిన కరుణాకర్ రెడ్డి బృందాన్ని శ్రీవారు కచ్చితంగా శిక్షిస్తారు. వడ్డీకాసుల వాడు.. వడ్డీతో సహా వారి నుంచి వసూలు చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయి" అని భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. పరకామణి అనేది అత్యంత సున్నితమైన అంశమని, కరుణాకర్ రెడ్డి చెబుతున్న అబద్ధాలను భక్తులు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఏసీఏ కీలక నిర్ణయం.. విశాఖ స్టేడియంలోని ఒక వింగ్‌కు శ్రీ చరణి పేరు

- మొదటి పేజి తరువాయి

పెట్టనున్నట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ప్రకటించింది. ఈ నిర్ణయం క్రీడా వర్గాల్లో హర్షం నింపుతోంది. మంగళగిరిలోని క్రికెట్ స్టేడియంలో జరిగిన మీడియా సమావేశంలో ఏసీఏ అధ్యక్షుడు, టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. అంతకుముందు, శ్రీ చరణి ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆమె ప్రతిభను అభినందించిన సీఎం, రాష్ట్ర ప్రభుత్వం తరపున భారీ ప్రోత్సాహకాలను ప్రకటించారు. శ్రీ చరణికి గ్రూప్ 1 స్థాయి ఉద్యోగం, రూ. 2.5 కోట్ల నగదు బహుమతి, కడపలో నివాస స్థలం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ తర్వాత మంగళగిరిలో కేశినేని చిన్ని మాట్లాడుతూ, ఏసీఏ తరపున రాష్ట్రంలోని క్రీడాకారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. శ్రీ చరణికి లభించిన ఈ గౌరవం భవిష్యత్ తరాల క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, రాష్ట్రంలో మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో త్వరలోనే ఒక మహిళా క్రికెట్ అకాడమీని ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు.

# అనంతపురం జిల్లాలో మంత్రి నారా లోకేశ్ కు ఘనస్వాగతం

- మొదటి పేజి తరువాయి

స్వాగతం పలికారు. విమానాశ్ర యం నుంచి లోకేశ్ రోడ్డు మార్గంలో కళ్యాణదుర్గం బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు రోజుల పర్యటన కోసం జిల్లాకు వచ్చానని, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను కలుసుకుంటానని తెలిపారు. మార్గమధ్యంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. లోకేశ్ పర్యటన దారి పొడవునా టీడీపీ శ్రేణులు, ప్రజలు ఆయనకు నీరాజనాలు పలికారు. ధర్మవరం పట్టణంలోని పొట్టి శ్రీరాములు కూడలి వద్ద తెలుగు యువత ఆధ్వర్యంలో భారీ గజమాలతో ఆయనకు స్వాగతం పలికారు. అదేవిధంగా, రాప్తాడు నియోజకవర్గంలోని మామిళ్లపల్లి గ్రామంలో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగత ఏర్పాట్లు చేశాయి. మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలికిన వారిలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, కందికుంట వెంకట ప్రసాద్, దగ్గుబాటి వెంకట ప్రసాద్, బండారు శ్రావణి శ్రీ, ఎంఎస్ రాజు తదితరులు ఉన్నారు.

## దేశభక్తి స్ఫూర్తి మంత్రం.. 'వందేమాతరం'



**కడప, పెన్ పవర్ నవంబర్ 7:** యావత్ భారతావనిలో దేశభక్తిని నింపే స్ఫూర్తి మంత్రం వందేమాతర గేయం అని జిల్లా ఇంచార్జి రెవెన్యూ అధికారి వెంకటపతి పేర్కొన్నారు.వందేమాతరం గేయ రచన చేసి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా.. జిల్లా కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో శుక్రవారం 'వందేమాతరం' సామూహిక గేయాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా ఇంచార్జి రెవెన్యూ అధికారి వెంకటపతి తోపాటు.. గురుకుల విద్యాలయాల జిల్లా కో ఆర్డినేటర్ ఉదయశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాకవి బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో కాలంలో.. కోట్లాది మంది భారతీయుల్లో దేశభక్తి స్ఫూర్తి నింపిందన్నారు. ఇప్పటికీ దేశ వ్యాప్తంగా అదే గీతాన్ని ప్రతి విద్యాలయాల్లో ప్రధనా గీతంగా అలపిస్తున్నారన్నారు. వందేమాతరం అనేది మన దేశం పట్ల ఉన్న గౌరవం, ప్రేమ, మరియు సేవాస్ఫూర్తికి ప్రతీక అన్నారు. దేశ భక్తిని, జాతీయ స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంతా ఏకమై వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ దేశభక్తి గీతం ఉద్యోగుల్లో కూడా జాతీయత భావాన్ని, ఐక్యతను మరింత పెంపొందిస్తుందని కొనియాడారు. ఈ సందర్భంగా భారత్ మాతా కి జై ...అంటూ పోలీస్ అధికారులు, సిబ్బంది నినదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపధికల్పన అధికారి సురేష్ కుమార్, ఏ.ఓ. విజయ్ కుమార్, కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల సూపరిన్టెండెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# పెన్ పవర్

## వై.ఎస్.ఆర్. కడప

## అన్నమయ్య జిల్లా

## రక్తదానం మహా ప్రాణదానం : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్




**చిత్తూరు, పెన్ పవర్ నవంబర్ 07:** రక్తదానం మహా ప్రాణదానమని తద్వారా ఆరోగ్యం బాగుండడమే కాకుండా ప్రమాదాల బారిన పడిన వారికి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చు అని తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మెగా స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమం జీడీ నెల్లూరు మండలం, సుందరాజపురం లో విజయం విద్యాసంస్థ నందు సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి, జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం మరియు వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జీడి నెల్లూరు నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ వి ఎం థామస్ తో కలిసి వందేమాతరం గీతం ఆలపించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ఒక మనిషికి ప్రాణదానం చేసిన వారు అవుతారని ప్రస్తుత సమాజం లో వివిధ రకాల జబ్బులు, ప్రమాదాలు గురవుతున్న వారికి రక్తం ఎంతో అవసరం అవుతుంది. కావున విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థితికి ఎదగాలని, ఉన్నత విలువలు, భావాలతో జీవనం సాగిస్తూ సమాజ హితం కోరి సేవాభావంతో ముందు కెళ్లాలని మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావా లని సమాజ సేవలో భాగస్వాములు కావాలని తెలియజేస్తూ విజయం విద్యాసంస్థల అధినేతలు సమాజ సేవలో భాగస్వాములై స్వచ్ఛంద రక్తదాన శిబిరాలతో పాటు అనేక సమాజ సేవా కార్యక్రమలలో భాగస్వాములు కావడం అభినంద నీయమని తెలిపిరి. రాష్ట్రంలోనే ఉత్తమ సేవలనందించిన విద్య సంస్థగా Service Excellence Award ను రాష్ట్ర గవర్నర్ ద్వారా పొందడం– ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేసారు. జీడి నెల్లూరు నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ వి ఎం థామస్ గారు హాజరై విద్యార్థులు విద్యార్థి దశనుండే సేవా తత్పరత, నాయకత్వ లక్షణాలతో ఉన్నత స్థితికి ఎదగాలని చెడు అలవాట్లకు గురికాకుండా ఆరోగ్యవంతమైన సమ సమాజం కొరకుకృషి చేయాలని తెలియజేసిరి విజయం విద్యాసంస్థలు వారు 32 సార్లు మెగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించి సమాజం లో ఎంతోమందికి ప్రాణదానం చేసిన వారైనారని విద్యాసంస్థల అధినేతలను మరియు విద్యార్థులను అభినందించిరి. ఈ మెగా స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో డిగ్రీ, ఎంబీఏ, మరియు ఇంజనీరింగ్ విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం జరిగినది. ఇందులో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చిత్తూరు జిల్లా శాఖ చైర్మన్ రమేష్ బాబు, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు జగదీశ్వర్ నాయుడు విజయం విద్యా సంస్థల అధినేతలు తేజో మూర్తి, శైలజ గార్లు మరియు కళాశాలల ఏ ఓ రాజగోపాల నాయుడు, విజయం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపి విజయం బిజినెస్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ జయంత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దేవేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

## రాయల చెరువుకు గండి పడి ముంపుకు గురైన ప్రాంతాలు పరిశీలన



**కెవిబిపురం,పెన్ పవర్ నవంబర్ 7 :** గ్రామ ప్రజలు ఎవరూ అధైర్యపడొద్దని, ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం కె వి బి పురం మండలం పాతపాలెం వద్ద గల ఓలూరు రాయల చెరువుకు గండి పడి ముంపుకు గురైన గ్రామాలను ప్రాంతాలను సత్యవేడు ఎం ఎల్ ఎ ఆదిమూలం, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జలసుధీర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, శ్రీకాళహస్తి ఆర్ డి ఓ. భాను ప్రకాష్ రెడ్డి, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ శాఖ అధికారుల తో కలిసి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎవరూ అధైర్యపడొద్దని, ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని రెండు రోజుల్లో మొత్తం ఊరంతా శుభ్రం చేసి, వీధి దీపాలను ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించడం జరుగుతుందని తెలిపారు. ఇళ్ళు తడిగా ఉన్నందున విద్యుత్ సరఫరా కష్టం కనుక జాగ్రత్తగా, రెండు రోజుల తర్వాత మాత్రమే ఇస్తామని, అంతవరకు ప్రభుత్వం భోజనం, నీటి సదుపాయాలు, అవసరమైన దుప్పట్లు అందిస్తుందని చెప్పారు. తాత్కాలికంగా ప్రజలకు స్థానిక పాఠశాలలో పునరావాసంతో ఆటు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. నీటితో మునిగిన క్లీనింగ్ సహాయం లో భాగంగా ప్రతి ఇంటికి రూ.10,000 చొప్పున నష్టపరిహారం ప్రభుత్వం ద్వారా ఇవ్వనున్నట్టు తెలిపారు. పశువులు చనిపోతే కూడా మేక, గొర్రెకు రూ.7,500, ఆవుకు రూ.40,000, ఒక గేదెకు రూ.50,000 చొప్పున పరిహారం అందిస్తామని తెలిపారు. అదనంగా ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు, ?3,000 వంట సామానుల కోసం అందజేస్తామని పేర్కొన్నారు. ఇంటి స్థలాలు కోల్పోయిన వారికి కొత్త స్థలాలు కేటాయించి, ఇళ్ళు మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. మీ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి గారి సూచనలతో ప్రభుత్వం వేగంగా సహాయక చర్యలు చేపడుతోందని, ఎవరూ నిరాశ చెందవద్దని, ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని హామీ ఇచ్చారు. గ్రామంలోని ప్రజలకు నిత్యవసర సరుకులైన 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ చక్కర, లీటర్ వంటనూనె, కేజీ ఉల్లిగడ్డలు,కేజీ చక్కర, రూ. 3 వేల రూపాయలు, దుప్పట్లును సత్యవేడు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలతో కలిసి జిల్లా కలెక్టర్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్సీ రాధాకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి, డిఆర్డిఏ పిడి శోభన్ బాబు, మెప్మా పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు, విద్యుత్ శాఖ ఎస్ ఈ చంద్రశేఖర రావు, సంబంధిత శాఖ మండల అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## సురవరం ప్రతాపం రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం బీవోఎస్ సభ్యుడిగా వైవియూ డాక్టర్ మృత్యుంజయరావు




**కడప పెన్ పవర్ నవంబర్ 7 :** యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళా విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయ రావు తెలంగాణాలోని సురవరం ప్రతాపం రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం లలిత కళా విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బిఓఎస్) సభ్యుడిగా నియమితులయ్యారు. ఆ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య నిత్యానంద రావు ఆదేశాల మేరకు నామినేట్ చేసినట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంత రావు తెలిపారు. సభ్యుడిగా 3 సంవత్సరాలగా సిలబస్, విధి విధానాల రూపకల్పనలో మృత్యుంజయ రావు సేవలు అందించనున్నారు. కాగా ఈయన ఎంపిక పట్ల విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ, ఆ విభాగం అధ్యాపక సిబ్బంది, సహచర అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

## మహిళా క్రికెటర్ శ్రీ చరణికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సాహకం

- రూ.2.5 కోట్ల నగదు నజరానా – ఇంటి నిర్మాణం కోసం 1000 చ.గ. స్థలం
- గ్రూప్ 1 ఉద్యోగం ఇవ్వాలని సీఎం నిర్ణయం
- మర్యాదపూర్వకంగా క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన శ్రీచరణి
- మహిళా క్రికెటర్‌కు పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికిన మంత్రి నారా లోకేశ్







**అమరావతి, పెన్ పవర్ నవంబర్ 7 :** మహిళా క్రికెట్ వరల్డ్ కప్ విజేత, టీమిండియా సభ్యురాలైన తెలుగమ్మాయి శ్రీ చరణికి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు భారీ నజరానా ప్రకటించారు. శ్రీ చరణికి రూ.2.5 కోట్ల నగదు బహుమతి ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. దీంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు కడపలో 1000 చ.గ. స్థలం కేటాయిస్తున్నట్టు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం లో గ్రూప్ 1 అధికారిగా ఉద్యోగం కూడా కల్పిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి నారా లోకేష్‌ను క్రికెటర్ శ్రీ చరణి మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకున్న ఆనందక్షణాలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో శ్రీ చరణి పంచుకున్నారు. తనకు మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ శ్రీ చరణిని అభినందించారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకోవడం ద్వారా భారత దేశ మహిళల సత్తా చాటారని, మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని సీఎం అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు భారత జట్టుకు అందించాలని అభిలషించారు. ఈ సందర్భంగా శ్రీ చరణి మహిళా క్రికెటర్లు సంతకాలు చేసిన టీ షర్ట్ ను ముఖ్యమంత్రికి అందించారు. దానిని ఆప్యాయంగా స్వీకరించిన ముఖ్యమంత్రి శ్రీచరణి బృందం భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. శ్రీ చరణితో పాటు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా ఉన్నారు. అంతకుముందు గన్నవరం ఎయిర్ పోర్టులో శ్రీ చరణికి ఘన స్వాగతం పలికిన మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు... ఆమెతో పాటు సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ శ్రీ చరణికి స్వాగతం పలికారు.

## ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరండి

**– జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్**



**తిరుపతి పెన్ పవర్ నవంబర్ 7 :** భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ వ్యవస్థాపక దినోత్సవాన్ని తిరుచానూరు లోని జెడ్పీ ఉన్నత పాఠశాల లో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ ముఖ్య అతిధిగా విచ్చేసి,



మాట్లాడుతూ ఉత్తమ పౌరులుగా ఎదిగవందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ లో చేరాలని పిలుపునిచ్చారు. ఈ స్కౌట్స్, గైడ్స్ అభివృద్ధికి ఎటువంటి సహాయం కావాలన్న తాను ముందుండి జరిపిస్తానని తెలియజేశారు. క్రమశిక్షణ కలిగిన వ్యవస్థగా ప్రపంచమంతా వ్యాప్తి చెంది ఉన్నందువలన అనేకమంది బాలబాలికలు ఈ యొక్క ఉద్యమంలో చేరి అనేక నైతిక విలువలు నేర్చుకుంటూ సామాజిక సేవలో ఎలా పాల్గొనాలో ఎటువంటి సహాయ కార్యక్రమాలు చేయాలనే, సేవా భావాలతో యూనిఫారం ధరించి చేస్తూ ఉంటారని, వీరి యొక్క స్వచ్ఛంద సేవ ప్రశంసనీయమైనదన్నారు. ఆడిసినల్ ప్రాజెక్టు ఆఫీసర్ జి గౌరీ శంకర్, ఉప విద్యాశాఖ అధికారిని ఇందిరా దేవి ఆమె ఉపన్యసిస్తూ, స్కౌట్ వ్యవస్థలో పిల్లలు పాఠశాల స్థాయి నుంచి అన్ని విధాల ఉత్తమ పౌరులుగా భావి భారత పౌరులుగా ఇందులో ఉన్న నియమాలు ఆచరిస్తూ స్కౌట్ చట్టాన్ని గౌరవిస్తూ వారు ఆనందంతో ఈ యొక్క కార్యక్రమాలను చేస్తూ ఉంటారని, ఇంకా మరిన్ని కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ కమిషనర్ వంశీ రాజా, ఉపాధక్షులు కుప్పిరెడ్డి, జిల్లా ట్రైనింగ్ కమిషనర్ జి వెంకటేశ్వర్లు, ఏఎస్ఓసి కోటేశ్వరరావు, జిల్లా కార్యాలయ కమిషనర్ టి రమేష్ బాబు, డిఓసి లు సతీ సావిత్రి , ఏ వెంకటేశ్వర్లు కోశాధికారిని వాసుకి గైడ్ క్యాప్టెన్ పాల్గొన్నారు. భారీ సంఖ్యలో స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.

## వందేమాతర గీతం భారత దేశ ఆత్మను ప్రతిబింబించిన నినాదం

**– జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి**




**కర్నూల్ పెన్ పవర్ నవంబర్ 7 :** వందేమాతరం150 ఏళ్ల సంస్మరణోత్సవంను పురస్కరించుకొని కర్నూలు లో కొండారెడ్డి బురుజు వద్ద వందేమాతర గీతం ఆలాపన కార్యక్రమము నిర్వహించటం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్. ఎ. సిరి మాట్లాడుతూ వందేమాతర గీతం భారత ఆత్మను ప్రతిబింబించిన నినాదం అని, అది ఒక జాతిని మేల్కొలిపిన శక్తి అని తెలిపారు. వందేమాతరం స్వాతంత్ర్య ఉద్యమకారులకు మనోబలాన్ని ఇచ్చి, సామాన్యులను సమరయోధులుగా మార్చిందని,ఈ పాట భారత మాత స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని, భారత ప్రజల ఐక్యతను, వైవిధ్యాన్ని జరుపుకుంటుందని తెలిపారు. భారత స్వాతంత్ర్య సమరానికి ప్రేరణనిచ్చిన వందేమాతరం గేయం ఈ రోజు 150వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోందని బంకించంద్ర ఛటర్జీ 1875 నవంబర్ 7న ఈ గేయాన్ని రచించారని తెలిపారు. ప్రతి ఒక్కరు జాతీయత భావాన్ని పెంపోందించుకొని దేశాభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ, ఆర్ఐఓ లాలప్ప , మున్సిపల్ కమిషనర్ కార్యాలయ సిబ్బంది, ఎన్‌సిసి విద్యార్థులు, స్కౌట్స్& గైడ్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, ప్రజలు పాల్గొనడం జరిగినది.






## కల్యాణదుర్గంలో మంత్రి నారా లోకేష్‌కు ఘనస్వాగతం



















**కల్యాణ దుర్గం పెన్ పవర్ నవంబర్ 7 :** గజమాలతో మంత్రి లోకేష్ కు స్వాగతం పలికిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు. కల్యాణదుర్గం పట్టణంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో మంత్రి లోకేష్‌కు ఘనస్వాగతం పలికారు. ముదిగల్లు రోడ్డులో మంత్రి లోకేష్‌కు అశేష ప్రజానీకం పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు.

బాణసంచా కాల్చి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. టి సర్కిల్, గాంధీ సెంటర్ లో గజమాలతో మంత్రి లోకేష్‌కు స్వాగతం, పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు.

## జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం...
### – డాక్టర్ కే నాగరాజు




**కడప పెన్ పవర్ నవంబర్ 7 :** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. నాగరాజు గారి అధ్యక్షతన జాతీయ కాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా "క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ తో సాధ్యం" అనే నినాదంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుండి అవగాహన ర్యాలీ జరిగినది. ఈ సమావేశంలో డాక్టర్ కే.నాగరాజు గారు మాట్లాడుతూ సమాజంలో జీవన ప్రమాణాలు పెరగడం జీవనశైలిలో మార్పులు రావడంతో అసంక్రమిత వ్యాధులు పెరుగుతున్నాయి. బిపి, షుగర్ లతోపాటు ఈ రోజుల్లో క్యాన్సర్ వ్యాధులు కూడా పెరుగుచున్నాయి అని తెలిపారు. ఈ క్యాన్సర్ వ్యాధులు సకాలంలో గుర్తిస్తే పూర్తిగా నయం అవుతుందని, ఆలస్యంగా గుర్తించబడడం వలన తిరిగి నయం చేయలేని పరిస్థితిలో ఉంటాయని అధిక మరణాలు సంభవిస్తాయని ఈ పరిస్థితుల్లో పేషంటుతో పాటు కుటుంబ ఆర్థిక భారం, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 18 సంవత్సరాలు పైబడిన ప్రతి పౌరునికి ఉచితంగా నోటి రొమ్ము మరియు గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ సదుపాయం కల్పిస్తోంది. ఈ పరీక్షలు చేయించుకోవడానికి మీ ఇంటి వద్దకు వచ్చే ప్రభుత్వ ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని అలాగే మీ సమీపంలో ఉన్న ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరీక్షలు పూర్తిగా ఉచితంగా చేయబడతాయని తెలిపారు. క్యాన్సర్ అంటే భయపడాల్సిన పనిలేదు ముందుగానే గుర్తిస్తే పూర్తిగా నయం చేయగలరని డాక్టర్ ప్రవీణ్ (ఆర్.బి.ఎస్.కే. మరియు ఎన్సీడీ)గారూ తెలిపారు, ఈ ర్యాలీ ఐటిఐ సర్కిల్ వరకు సాగినది ఇక్కడ క్యాన్సర్ పై ప్రతిజ్ఞ చేశారు మరియు వందేమాతర గేయం 150 సంవత్సరాలు అయిన సందర్భంగా వందేమాతర గేయాన్ని అందరూ కలిసి ఆలపించారు. ఈ ర్యాలీలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, డాక్టర్ రవిబాబు, డాక్టర్ ప్రవీణ్,డాక్టర్, డాక్టర్ వెంకటాచంద్రా రెడ్డి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు, పట్టణ ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్స్, డెమో భారతి, ఆరోగ్యశాఖ ఆఫీస్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

## వరల్డ్ కప్ విన్నర్ శ్రీ చరణి రెడ్డికి ఆత్మీయ స్వాగతం




కడప పెన్ పవర్ నవంబర్ 7 : ప్రపంచ విజేత శ్రీచరణికి ప్రోత్సాహకరమైన ప్యాకేజ్ ప్రకటించిన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు. మహిళా క్రీడాకారిణుల ప్రోత్సాహార్థం–శ్రీచరణికి రూ.2.5 కోట్లు నగదు, Group-I ఉద్యోగం, కడపలో గృహ స్థలం. మహిళా క్రీడలకు కొత్త దశ ప్రారంభిం చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. క్రీడల పట్ల అంకితభావం చూపించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు. క్రికెట్‌తో పాటు అన్ని క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. క్రీడఆంధ్రప్రదేశ్‌గా మార్చాలని సంకల్పంతో నారా చంద్రబాబు గారు ఉన్నారు. ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారికి మరియు రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిన శాప్ చైర్మన్ రవి నాయుడు గారు.

## జిల్లా అభివృద్ధికి కార్పోరేట్ సంస్థలు సహకరించాలి
### – జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి




**కర్నూలు, పెన్ పవర్ నవంబర్ 7 :** జిల్లాలో కార్పొరేట్ సంస్థలు జిల్లా అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ వివిధ కార్పొరేట్ సంస్థల ను కోరారు. శుక్రవారం సాయంకాలం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో డిస్ట్రిక్ట్ లెవెల్ సి ఎస్ ఆర్ రివ్యూ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా పూర్తిగా వర్షాధారంపై ఆధారపడి ఉందని , ప్రధానంగా జిల్లా పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి జిల్లాలో ఉన్న కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వ నిబంధనల మేరకు తమ సంస్థల లాభాల నుండి రెండు శాతం నిధులను కేటాయించాలని కోరారు.

ఈ నిధులను ఒక పద్ధతి ప్రకారం జిల్లా యంత్రాంగం సూచనల మేరకు వెచ్చించాలని వారిని కోరారు. ఇందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ ను సమర్పించాలని జిల్లా పరిశ్రమల జిఎం ను ఆదేశించారు. ఈ సమావేశానికి సిపిఓ భారతి, గ్రీన్ కో సంస్థ నుండి బాషా మరియు శరత్చంద్రరావు , టీజీవి ఇండస్ట్రీస్ నుండి రాఘవేంద్ర రెడ్డి ,రాజేష్ కుమార్ మరియు హరి కిషోర్, జయరాజ్ ఇస్పాత్ నుండి అరవింద్ , మారుతి ఇస్పాత్ అండ్ పైప్స్ శ్రీనివాస్, ఆదాని విల్మార్ నుండి రామమూర్తి, అర్సలర్ మిట్టల్ ఏ ఎమ్ గ్రీన్ ఎనర్జీ నుండి లక్ష్మీకాంత్ మరియు జిల్లా అధికారులు...జి.ఎం. డిస్టిక్ ఇండస్ట్రీస్ అశోక్ కుమార్,డి డి జవహర్ బాబు, ఏడి డేనియల్,సి.పి.ఓ. భారతి ,జెడ్ఎం.మధుసూదన్,నాబార్డ్ మేనేజర్ సుబ్బారెడ్డి, డి ఎం హెచ్ ఓ భాస్కర్, జిల్లా ఔషధ నియంత్రణ అధికారి హనుమన్న , లేబర్ ఆఫీసర్ సీతా లక్ష్మి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి ,కర్నూలు కార్పొరేషన్ సతీష్ కుమార్ రెడ్డి , ఆదోని మున్సిపల్ కమిషనర్ సందీప్ కుమార్, గూడూరు నగర పంచాయతీ నుండి విజయలక్ష్మి పాల్గొన్నారు.

## వరల్డ్ కప్ విన్నర్ శ్రీ చరణి రెడ్డికి స్వాగతం పలికిన మంత్రి నారా లోకేష్ బాబు



అమరావతి పెన్ పవర్ నవంబర్ 7 : సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చిన ఇండియన్ ఉమెన్ క్రికెటర్ శ్రీచరణి, మాజీ కెప్టెన్ మిథాలి రాజ్. సీఎం చంద్రబాబును కలిసిన శ్రీచరణి, మిథాలీ రాజ్. క్యాంప్ కార్యాలయానికి వచ్చిన శ్రీచరణి, మిథాలి రాజ్‌కు స్వాగతం పలికిన మంత్రి నారా లోకేష్. ఉమెన్ క్రికెట్ వరల్డ్ కప్ గెలుచుకున్నందుకు శ్రీచరణిని అభినందించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్. శ్రీచరణి, మిథాలి రాజ్‌లతో సమావేశమైన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్. వరల్డ్ కప్ గెలుచుకున్న ఆనందక్షణాలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో పంచుకున్న శ్రీచరణి. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకోవడం ద్వారా భారత దేశ మహిళల సత్తా చాటారని, మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారన్న సీఎం చంద్రబాబు. గన్నవరం ఎయిర్ పోర్టులో శ్రీచరణికి ఘన స్వాగతం పలికిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు. శ్రీచరణి, మిథాలీ రాజ్‌ను వెంటపెట్టుకుని సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చిన ఎంపీలు, మంత్రులు, శాప్ ఛైర్మన్.

## కర్నూలు కేవిఆర్ కాలేజ్ ఆఫ్ క్లస్టర్ యూనివర్సిటీ నందు న్యాయ విజ్ఞాన సదస్సు






**కర్నూలు పెన్ పవర్ నవంబర్ 7 :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి సూచనల మేరకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం నవంబర్ 9న జాతీయ న్యాయ సేవ దినోత్సవంను పురస్కరించుకొని 07.11.2025 న కర్నూలు నందు గల కేవిఆర్ కాలేజ్ ఆఫ్ క్లస్టర్ యూనివర్సిటీ నందు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవ దినోత్సవ ప్రత్యేకత ను, సైబర్ చట్టాలు మరియు క్రిమినల్ చట్టాల గురించి ఉచిత న్యాయ సేవలు న్యాయ సేవ అధికార సంస్థ నుంచి ఎలా పొందాలో వివరించారు. అనంతరం లీగల్ సర్వీసెస్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎవరికైనా చట్టపరమైన న్యాయ సహాయం కావాలంటే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కాల్ చేసి పొందవచ్చు అని తెలిపారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే. వి. వెంకట రెడ్డి, పొలిటికల్ సైన్స్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు డాక్టర్ శాహితి, విద్యార్థులు పాల్గొన్నారు.

## బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో ఖచ్చితమైన నిబంధనలు : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి



**కర్నూలు పెన్ పవర్,నవంబర్ 7 :** ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌లు మరియు డయాగ్నస్టిక్ సెంటర్లు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్ర వారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కాలుష్య నియంత్రణ చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆసుపత్రులు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోగులు, సిబ్బంది మరియు ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా వైద్య వ్యర్థాలను సక్రమంగా వేరు చేసి, శాస్త్రీయ పద్ధతిలో నిర్వర్తించాల్సిన అవసరం ఉందని సూచించారు.ఆసుపత్రులలో కాలం చెల్లిన మందులను సక్రమంగా ధ్వంసం చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. అటువంటి మందులను సాధారణ చెత్తతో కలిపి పారబోసినట్లయితే పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు కలుగుతుందని హెచ్చరించారు. బయో మెడికల్ వేస్ట్ సొల్యూషన్ ట్రీట్మెంట్ ప్లాంట్ ప్రతినిధితో వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో నాలుగు వాహనాల ద్వారా అన్ని ఆసుపత్రుల నుండి వేస్ట్ కలెక్ట్ చేసుకుని నిర్వీర్యం చేస్తామని ప్రతినిధి కలెక్టర్ కు తెలియజేశారు. ఆదోని ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ ను ఫోన్ ద్వారా ఏ విధంగా బయోమెడికల్ వేస్ట్ ను నిర్వీర్యం చేస్తున్నారన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రుల చెత్తను సరైన విధంగా వేరు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. రెడ్, యెల్లో, బ్లూ, వైట్ రంగుల బయో కోడింగ్ బ్యాగులు ఉపయోగించి ఇంజెక్షన్ సూదులు, పత్తి, గ్లౌవ్స్, శరీర వ్యర్థాలు వంటి బయోమెడికల్ వ్యర్థాలను వేర్వేరు సంచుల్లో వేరు చేయాలని సూచించారు.ఇది వ్యర్థాల శాస్త్రీయ నిర్వాహణకు కీలకమని కలెక్టర్ అన్నారు. అదేవిధంగా, ప్రతి ఆసుపత్రి, క్లినిక్, ల్యాబ్ తమ వద్ద ఉత్పత్తి అయ్యే బయోమెడికల్ వ్యర్థాల వివరాలను బయోమెడికల్ వేస్ట్ మానేజ్మెంట్ యాప్ లో ప్రతిరోజూ డేటా ఎంట్రీ చేయడం తప్పనిసరి అని కలెక్టర్




తెలిపారు. డేటా ఎంట్రీ చేయని సంస్థలపై కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకోవాలని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ "చెత్తను వేరు చేసే ముందు ఆలోచించండి" అనే గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిషోర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ భాస్కర్, చంద్రమోహన్ రెడ్డి పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ,డాక్టర్ జఫ్రుల్లా డిసిహెచ్ఎస్,డాక్టర్ వెంకటేశ్వర్లు జి జి హెచ్ సూపరింటెండెంట్ , డాక్టర్ వేణుగోపాల్ ఐఎంఏ ప్రతినిధి, కర్నూలు ఆదోని,ఎమ్మిగనూరు,గూడూరు మున్సిపల్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా...
## చెన్నూరు మండలంలో అపూర్వస్పందన...




**చెన్నూరు పెన్ పవర్ నవంబర్ 7 :** కమలాపురం నియోజకవర్గం చెన్నూరు మండలం బలిసింగయ్య పల్లె లో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి రాష్ట్ర %ాజుజ% సభ్యులు సాయినాథ్ శర్మ గారు మసీమ బాబు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా వైయస్సార్ సిపి రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన కోటి సంతకాల సేకరణ లో సంతకాలు సేకరించిన జిల్లా అధ్యక్షులు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న భాస్కర్ రెడ్డి సురేష్ యాదవ్ మహిళా నాయకురాలు దాదిరెడ్డి భాగ్యమ్మ శ్రీకాంత్ అన్వర్ భాష మరియు స్థానిక పార్టీ నాయకులు కార్యకర్తలు అనంతరం జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలల కాలం కావస్తున్న ఒక్క పథకం అమలులో లేదు. అనేక హామీలతో రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేశారు చంద్రబాబు. జగన్మోహన్ రెడ్డి తెచ్చిన మెడికల్ కాలేజీలను కమిషన్ల కోసం ప్రైవేటుపరం చేయాలనుకోవడం ఎంతవరకు సబబు. ప్రైవేటు పరం చేయడం వల్ల రాష్ట్ర ప్రజలకు వైద్య విద్య వైద్యం దూరమవుతుంది. ప్రైవేట్ పరం చేస్తే కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి మెడికల్ సీట్లు తెచ్చుకునే పరిస్థితి లేదు.

వైద్యం కూడా సామాన్య ప్రజలకు దూరమవుతుంది. వీటి అన్నిటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రజలకు వైద్య విద్య, వైద్యం అందుబాటులో ఉండాలని తలచిన వైయస్ జగన్. కమీషన్ల కోసమే చంద్రబాబుకు అతి తక్కువ ధరలకు ప్రైవేటు పరం చేసి కోట్లు దండుకుంటున్నారు. చంద్రబాబు చేసే దౌర్భాగ్యపు పనులను రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకుంటే రాష్ట్రాన్ని అమ్మేస్తాడు. రాష్ట్ర ప్రజలు కోటి సంతకాలతో వ్యతిరేకించాలి. అంతటితో ఆగకపోతే మరిన్ని ఉద్యమాలు చేసైనా వైద్య కళాశాలలను నిలబెట్టుకోవాలి. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడిపేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి... జిల్లా అధ్యక్షులు పి రవీంద్రనాథ్ రెడ్డి.

## చక్కని జీవన శైలి ద్వారా క్యాన్సర్‌ను దూరం చేయవచ్చు







**కడప పెన్ పవర్ నవంబర్ 7 :** చక్కని జీవన శైలి ద్వారా క్యాన్సర్ ను దూరం చేయవచ్చని యోగి వేమన విశ్వవిద్యాలయం సైకాలజీ శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ కే లలిత అన్నారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం జాతీయ సేవా పథకం యూనిట్– 4,7 ఆధ్వర్యంలో క్యాన్సర్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లలిత మాట్లాడుతూ క్యాన్సర్ జబ్బుకు కారణాలు, ఆరోగ్యకరమైన అలవాట్లు, శారీరక వ్యాయామం యోజనాలు, ఆహారపు అలవాట్లు గురించి అవగాహన కల్పించారు. ఎస్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సునీత ఆన్సర్ ప్రివెంటివ్ పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ పి సరిత, రమణ, ఎం.బి.ఎ హెచ్ఆర్ఎం విద్యార్థులు పాల్గొన్నారు.

## సచివాలయాల ఉద్యోగులు వారి పరిధిలో ఇంటింటికీ వెళ్లి వాట్సప్ గవర్నెన్స్ సేవలు : జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




**కర్నూలు పెన్ పవర్ నవంబర్ 07 :** జిల్లాలోని వంద శాతం కుటుంబాలు వాట్సప్ గవర్నెన్స్ సేవలను వినియోగించుకునేలా నేటి (7 వ తేదీ) నుండి ప్రతి శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరుగుతోందని, సచివాలయాల ఉద్యోగులు వారి పరిధిలో ఇంటింటికీ వెళ్లి అన్ని కుటుంబాలు వాట్సప్ గవర్నెన్స్ సేవలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. ప్రతి కుటుంబం మన మిత్ర యాప్ ద్వారా వాట్సప్ గవర్నెన్స్ సేవలు వినియోగించుకునేలా సచివాలయ ఉద్యోగులు ప్రతి శుక్రవారం ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ లు, ఎంపిడిఓ లు చర్యలు తీసుకోవాలని, జడ్పీ సీఈవో, డివిజనల్ లెవెల్ డెవలప్మెంట్ అధికారులు(డీఎల్డివో లు)ఈ అంశంపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ,వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వాట్సప్ సేవలు ఎలా వినియోగించుకోవాలి అని డెమో(ప్రదర్శన) చేసి, వారితో ఒక సర్వీస్ అయినా చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఆ సర్వీస్ కు సంబంధించిన ఫోటోలను అప్లోడ్ చేయాలన్నారు. క్యూ ఆర్ కోడ్ లు డిస్ప్లే చేయాలని, కరపత్రాలు పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలు, వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, ఇతర సచివాలయ సిబ్బందితో సమన్వయ పరచుకుని, అన్ని కుటుంబాలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.. అలాగే వీఆర్వోలు, విలేజ్ సర్వే అసిస్టెంట్లు, వార్డ్ రెవెన్యూ సెక్రటరీలు వాట్సఅప్ గవర్నెన్స్ ద్వారా అందుతున్న రెవెన్యూ, భూ సంబంధిత సేవల గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎనర్జీ అసిస్టెంట్స్, ఎనర్జీ సెక్రటరీలు విద్యుత్ శాఖకు సంబంధించి బిల్లు పేమెంటు,కొత్త కనెక్షన్, తదితర అంశాల మీద అవగాహన కల్పించాలన్నారు.. అలాగే వ్యవసాయం, ఉద్యాన శాఖ, సెరికల్చర్,పశు సంవర్ధకం, ఫిషరీస్, ఏఎన్ఎం, వార్డ్ హెల్త్ సెక్రటరీలు ఆయా శాఖలకు సంబంధించి వాట్సప్ గవర్నెన్స్ సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సులభంగా ఆన్లైన్ ద్వారా సేవలు అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమని, వంద శాతం కుటుంబాలు ఈ సేవలను వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.






ప్రపంచ క్రికెట్ కప్ గెలిచిన శ్రీ చరణి రెడ్డికి కడపలో భారీ స్వాగతం

# మనం నొప్పికి/బాధకి భయపడుతూ ఉంటే, జీవితంలో ముందుకు సాగడం సాధ్యమేనా?








**కడప పెన్ పవర్ నవంబర్ 7 :**

నొప్పి / బాధ అంటే భయం

కన్ఫ్యూషియస్ తన కాలంలో గొప్ప తత్వవేత్త, ఒక ప్రధాని. ఒకసారి అతను చైనాలోని ఒక పర్వత గ్రామంలో నడుస్తుండగా, ఒక వృద్ధ రైతు, యువకుడైన అతని కొడుకు తమ చేతులతో బావిలో నుండి నీటిని తీసి పొలానికి నీరు పెట్టడం చూశాడు. అప్పట్లో చిన్న రైతులు కూడా పశువులు, మిల్లుల ద్వారానే నీటిని తోడుకునేవారు. కన్ఫ్యూషియస్ మనస్సులో ఒక ప్రశ్న తలెత్తింది, ఈ రైతు, అతని కొడుకు సంపన్నులుగానే కనిపిస్తున్నారు. వాళ్లకు అంత పెద్ద పొలం ఉంది, ఇంకా ఎందుకు అలా కష్టపడుతున్నారు?

కన్ఫ్యూషియస్ రైతు వద్దకు వెళ్లి, "అన్నా, మీరిద్దరూ ఎందుకు అంతలా ఇబ్బంది పడుతున్నారు? నీరు తోడటానికి జంతువులను, మిల్లులను మీరు ఎందుకు ఉపయోగించట్లేదు?" అని అడిగాడు. వృద్ధ రైతు ఇలా అన్నాడు, "10 నెలల క్రితం, నా కొడుకు క్షయవ్యాధి సోకి అనారోగ్యంతో ఉన్నాడు, అతను రోజురోజుకు బలహీనపడుతూ ఉన్నాడు, మేం చాలా చోట్ల చికిత్స చేయించాం, కానీ ప్రయోజనం లేకపోయింది. నా కొడుకు రోజంతా ఒంటరిగా మంచం మీదే పడుకుని ఉంటున్నాడు. తర్వాత నేను ఒకరోజు ఇలా అనుకున్నాను. నా జీవితమంతా చెమటలు కక్కుతూ నా పొలాల్లో నేను కష్టపడి పనిచేశాను, దాని ఫలితంగా నేనెప్పుడూ అనారోగ్యానికి గురికాలేదు. 65 ఏళ్లు వచ్చినా ఇంకా చాలా కష్టపడగలుగుతున్నాను. నా కొడుకు కూడా కష్టపడితే అతనికి కొంత మేలు జరుగుతుందని అనుకున్నాను. అందుకే అనారోగ్యంతో ఉన్న నా కొడుకును ప్రతిరోజూ పొలానికి తీసుకురావడం ప్రారంభించాను, క్రమంగా నా కొడుకు కూడా నాకు సహాయం చేయడం ప్రారంభించాడు. మొదట్లో ఒళ్లునొప్పులతో చాలా బాధ పడేవాడు. ఒక్కోసారి జ్వరం వచ్చేంత అలిసిపోయేవాడు. అలా బలహీనంగా ఉన్న అతన్ని పొలానికి తీసుకురావద్దని గ్రామస్తులు కూడా సలహా ఇచ్చారు. అయినాసరే ఇద్దరం రోజూ పొలానికి వచ్చి ఏదో ఒక పని చేసుకుంటూ ఉండేవాళ్లం.

మొదట్లో చాలా బాధగా అనిపించినా క్రమంగా నా కొడుకు ఆరోగ్యం మెరుగుపడి పూర్తిగా కోలుకుంటున్నందుకు సంతోషంగా ఉంది". కన్ఫ్యూషియస్ ఆశ్చర్యంతో చాలా సామాన్యంగా కనిపిస్తున్న ఆ రైతు చెప్పేది వింటూనే ఉన్నాడు. రైతు ఇలా అన్నాడు, "మీరు బహుశా నన్ను నమ్మరు. మా ప్రాంతంలో, "నొప్పికి భయపడితే, మీరు ఎదగలేరు" అని ఒక సామెత ఉంది. కొన్నిసార్లు పరిష్కారాలు చాలా సులభంగా ఉంటాయి. సమాధానం సహనం, కష్టపడి పనిచేయడంలో ఉంటుంది, కానీ బాధలు అనుభవించాల్సివస్తుందన్న కారణంగా, ప్రజలు ఈ సత్యాన్ని విస్మరిస్తారు, బాధపడతారు."

వృద్ధుడి మాటలు విన్న కన్ఫ్యూషియస్ పర్వత డేగ గురించి ఆలోచించడం ప్రారంభించాడు. పర్వత డేగ జీవితకాలం 70 సంవత్సరాలు, కానీ 40 సంవత్సరాల వయస్సులో, దాని ఈకలు రాలిపోయి చాలా తేలికగా మారడం వలన అది తన ఎరను / ఆహారాన్ని త్వరగా వెంబడించలేదు. దాని కాలి గోళ్లు ఒకదానికొకటి తగులుకునేంత పొడవుగా పెరిగిపోతాయి, ఇది ఆ డేగ పంజా యొక్క పట్టును దుర్బలం చేస్తుంది. దాని ముక్కు కూడా చాలా బలహీనంగా మారిపోవడం వల్ల అది ఎరను/ఆహారాన్ని తెనలేకపోతుంది. ఈ డేగకు ఆ సమయంలో రెండు ఎంపికలు ఉంటాయి. ఒకటి తన మరణాన్ని అంగీకరించాలి, లేదా రెండోది ఎంపిక చేసుకోవాలి!

మిత్రులారా, మీరు డేగకు ఉన్న మరో ఎంపిక ఏమిటో తెలుసుకోవాలనుకుంటున్నారా?

రెండవ ఎంపిక చాలా నొప్పితో కూడుకున్నది.

డేగ నెమ్మదిగా పర్వతం పైకి ఎగురుతుంది. అంత ఎత్తులో ఏ ఇతర జంతువు దానిని వేటాడలేదు. సురక్షితమైన ప్రదేశానికి చేరుకున్న తర్వాత, అది మొదట దాని బలహీనమైన ముక్కును రాయిపై గట్టిగా కొట్టి, కొట్టి విచ్ఛిన్నం చేస్తుంది. కొద్ది రోజుల్లోనే కొత్త ముక్కు ఎదగడం ప్రారంభమవుతుంది. అప్పుడు ఈ క్రొత్తగా వచ్చిన ముక్కుతో, తన తేలికైన ఈకలను కూడా పీకేస్తుంది. కొన్ని రోజుల తర్వాత, ముక్కు బలంగా తయారైనప్పుడు, డేగ ముక్కుతో తన పొడుగాటి గోళ్లను బయటకు లాగేస్తుంది. ఈకలు, గోర్లు కూడా కొన్ని రోజుల్లో తిరిగి పెరుగుతాయి. 3 నెలల్లో, డేగ శరీరం కొత్తగా మారుతుంది. దానివల్ల మరో 30 సంవత్సరాలు అది గౌరవప్రదంగా జీవిస్తుంది. కానీ ఈ 3 నెలల్లో డేగ చాలా బాధను అనుభవిస్తుంది, ఆ బాధతోనే జీవిస్తుంది. ఇంత బాధను భరించేంత ధృడమైన శక్తి డేగకు లేకపోయినట్లయితే, అది యవ్వనంలోనే చచ్చిపోతుంది.

ఎదగడం, ముందుకు సాగడం కష్టం, ఇంకా బాధాకరం కూడా … కాబట్టి, మనం బాధను అంగీకరించి, స్వీకరించగలిగితే, మనం జీవితంలో కొత్త సోపానాలను అందుకోవచ్చు.

అంగీకరించి, స్వీకరించడం అంటే ఏమిటి?

అధికమవుతున్న నొప్పి అనే భావనలో దీనిని అర్థం చేసుకుందాం. గర్భవతి అయిన తల్లి ప్రతిరోజూ చాలా బాధపడుతుంది, కానీ తన బిడ్డ ఎదుగుతోందని ఆమెకు తెలుసు, ఆ నొప్పిని, బాధలను అంగీకరిస్తుంది. ఆమె బాధలో ఉంది కానీ విచారంగా లేదు. ఎప్పుడైతే నొప్పిని మన అభివృద్ధి కోసమే అన్న దృష్టిలో తీసుకుంటామో, అప్పుడు ఆ నొప్పి / బాధ మనల్ని బాధించదు కానీ ఇంకా బలపరుస్తుంది.

మనం నొప్పిని ఎలా అంగీకరిస్తాం? వాటితో అనుబంధించబడి ఉన్న పదాలను, భావాలను మార్చడం ద్వారా. జీవితంలో క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు, మనం మునుపటి కంటే బలంగా బయటికొస్తాం. సవాళ్లను ఆనందంతో స్వీకరించండి అప్పుడు ఎలాంటి అందం బయటపడుతుందో చూడండి.

**దాజీ హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**
**అనువాదబృందం ఆంధ్రప్రదేశ్**


# ట్రాఫిక్ నియంత్రణకు సహకారం అభినందనీయం





**కర్నూలు పెన్ పవర్ నవంబర్ 7 :** నగరంలోని బుధవారపేట, మెడికల్ కాలేజీ వద్ద మలుపు విస్తరణకు షాపులను స్వచ్ఛందంగా తొలగించడం ద్వారా షాషా మసీదు కమిటీ సభ్యుల సహకారం అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి కమిషనర్ క్యాంపు కార్యాలయంలో కమిటీ సభ్యులకు భవన నష్ట పరిహార చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని బుధవారపేట వద్ద ట్రాఫిక్ అంతరాయం కారణంగా దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ గారు ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తేదీ:17-10-2025వ ఆదేశాల ప్రకారం, 4.75 సెంట్ల స్థలంలో ఉన్న 7 షాపులకు రూ.27,11,994/- విలువైన చెక్కులు అందజేశామని, యాజమాన్య హక్కులను సమర్పించిన తర్వాత టిడిఆర్ బాండ్లను కూడా త్వరితగతిన జారీ చేస్తామని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని "చారిత్రాత్మక మలుపు"గా అభివర్ణించిన కమిషనర్, నగరాభివృద్ధిలో భాగంగా సామరస్యంగా సమస్య పరిష్కారానికి సహకరించిన మసీదు కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ బి. వెంకటరమణ, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ అంజాద్ బాష, బిల్డింగ్ ఇన్స్పెక్టర్ దివాకర్, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు మన్సూర్ అలీ ఖాన్, కార్పొరేటర్ జుబేర్, అలాగే ముత్తవల్లి అజాం, అబ్బాస్, హమీద్, రజాక్, మహబూబ్ పీర్, మునావర్ తదితరులు పాల్గొన్నారు.



భారత ప్రధాని మోడీగారి చే వరల్డ్ కప్ క్రికెట్ విన్నర్ శ్రీ చరణి రెడ్డికి ఘన సత్కారం....




# బీసీలకు పెద్ద పీటవేసిన కూటమి ప్రభుత్వం

**- బడుగు బలహీన వర్గాలపార్టీ టీడీపీ - టీడీపీతోనే బడుగులకు రాజ్యాధికారం - నారా లోకేష్ గారి చేతుల మీదుగా భక్త కనకదాసు విగ్రహ ఆవిష్కరణ - కనకదాసు రాష్ట్ర అధికారిక జయంతిగా శాశ్వత జీవో విడుదల**



**కళ్యాణ దుర్గం పెన్ పవర్ నవంబర్ 7 :** కూటమి ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేసిందని ,బీసీల పక్షపాతి చంద్రబాబు నాయుడు గారిని మంత్రి సవితమ్మ తెలిపారు అనంతపురం జిల్లా కళ్యాణ నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర అధికారిక శ్రీ భక్త కనకదాసు జయంతి సందర్భంగా విగ్రహ ఏర్పాట్ల ను నాయకులు, కులస్తులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత గారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించిన తర్వాతే బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించాలని తెలిపారు. కురుబలు అన్ని రంగాల్లోనూ అవకాశం కల్పించింది తెలుగుదేశం ప్రభుత్వం లోనని గతంలోనే మా నాన్నగారైన ఎస్ రామచంద్ర రెడ్డి గారికి మంత్రిగా,ఎంపీ గా టిటిడి బోర్డు మెంబర్ కూడా అవకాశం కల్పించా రన్నారు. తర్వాత పార్థసారథి గారికి ఎంపీగా ఎమ్మెల్యేగా టిడిపి మెంబర్ గా కూడా అవకాశం కల్పించారని తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే కురుబ కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ గా నాకు కూడా అవకాశం కల్పించారన్నారు. అదేవిధంగా గత ఎన్నికల్లో 2 ఎంపీలు నాకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చి మంత్రిగా కూడా అవకాశం కల్పించినది తెలుగుదేశం పార్టీతోనే అని తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మా కురుబల ఆరాధ్య దైవమైన శ్రీ భక్త కనకదాసు విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు గారు ఏర్పాటు చేయడం హర్షనీయమని తెలియ జేశారు. రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ గారి చేతుల మీదుగా రేపటి రోజున విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారన్నారు. త్వరలో అన్ని కార్పొరేషన్లు కూడా నిధులు కేటాయిస్తామని ప్రతి ఒక్కరిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి లక్ష్యమని ఆదరణ 3 పథకం కింద కులవృత్తుల ప్రోత్సహిస్తామని తెలియజేశారు.కురుబ కులస్తుల చిరకాలంగా ఎదురుచూస్తున్న శ్రీ భక్త కనకదాసు జయంతిని అధికారకంగా రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించడానికి శాశ్వత జీవో కూడా ఈరోజే విడుదల చేశామన్నారు. ఎన్నికల హామీలో భాగంగా యువగళం పాదయాత్రలో నారా లోకేష్ గారు హామీ ఇచ్చారని అధికారంలో రాగానే శాశ్వత జీవో ఇచ్చినందుకు మంత్రి నారా లోకేష్ గారికి చంద్రబాబు నాయుడు గారికి కురుబ కులస్తుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. అదేవిధంగా ఎన్నికల హామీలో భాగంగా గుడికట్ల పూజారుల గౌరవేతనం ధూప దీప నైవేద్యాలకు నెలకు 7000 రూపాయలు అందచేయబోతున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సత్యనారాయణ, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి కుష్బూ కొఠారి అధికారులు తదితరులు పాల్గొన్నారు

## జిల్లాలోని పాడి రైతులకు విరివిగా రుణాల అందజేయాలి : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, నవంబర్ 7 :** జిల్లాలోని పాడి రైతులకు విరివిగా రుణాల అందజేయాలి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోనే ప్రత్యేక సమావేశం మందిరములో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు రుణాలు అందజేయ దంలో లబ్ధిదారులు ఎంపిక పై సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిడి గోవిందయ్య, ఎల్ డి ఎం హరీష్ పశుసంవర్ధక శాఖ డాక్టర్లు, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజల జీవనోపాధి,స్థిరమైన ఆదాయం వచ్చేలా పశుసంవర్ధక శాఖల అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ పశుసంవర్ధక శాఖఅధికారులనుఆదేశించారు.తమ శాఖల ద్వారా అమలు పరిచే సంక్షేమ పథకాల పై పూర్తి అవగాహన కలిగి ఉండి, పట్టణ ప్రాంతాల్లో నే కాకుండా మారు మూల గ్రామాలకు వెళ్లి ప్రభుత్వము అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల పై ప్రజలకు పూర్తిఅవగాహనకలిగించినపుడే జిల్లా యంత్రాగం పై ప్రజలలో నమ్మకం కలుగుతుందన్నారు. పశుసంవర్ధక శాఖ ఏడి ల ద్వారా వారి పరిధిలో ఉన్న రైతుల్లో పాడి పరిశ్రమ మరియు పౌల్ట్రీ రంగంలో ఆసక్తి ఉన్న రైతుల జాబితాను సిద్ధం చేయాలని అందుకు అనుగుణంగా అవసరమైన ఆర్థిక సాయం అందించడానికి చర్యలుచేపట్టడంజరుగుతుందని తెలిపారు రైతులతో ప్రత్యక్షంగాను, సంబంధం కలిగి ఉండాలని పశుసంవర్ధక అధికారులను ఆదేశించారు, జిల్లాలో ఏ బ్యాంకుల వద్ద పాడి రైతులకు రుణాల సంబంధించిన ధ్రువ పత్రాలు ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎన్ని మంజూరు చేశారో సంబంధిత వివరాలతో నాకు నివేదికలు అందజేయాలని, ఆ నివేదికలను ఎల్డిఎం పర్యవేక్షణలో సంబంధిత పశు సంవర్ధక శాఖ అధికారులు బ్యాంకులను సంప్రదించాలని అర్హత కలిగిన రైతులకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు జిల్లాలో అత్యధిక రైతులు పాడి ఆధారపడి ఉన్నారని వారి ఆర్థికంగా అభివృద్ధి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో సుమారు 45 వివిధ బ్యాంక్ బ్రాంచీలలో పాడి రైతుల రుణం కొరకు దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, బ్యాంకు అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసే మంచి ఫలితాలు పాడి రైతులుగా అందించాలని తెలిపారు, బంగారు పాల్యం, పెద్ద పంజాణి, వి. కొత్తకోట మండలాల పాడి రైతులకు అత్యధికంగా రుణాలు మంజూరు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పాడి రైతులకు 20 కోట్లు రూపాయలు రుణాల అందజేయడానికి చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు ఇంకా జిల్లాలో సుమారు 4300 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని వాటిని పరిష్కరించవలసిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏడీలు, బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గడపగడపలో సంతకాల సేకరణకు అపూర్వ స్పందన

**- మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ భాషా**







**కడప పెన్ పవర్ నవంబర్ 7 :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు, కడప నియోజకవర్గంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న "కోటి సంతకాల సేకరణ" కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాష గారు, నార్త్ జోన్ అధ్యక్షులు బిహెచ్ఇలియాజ్ గారు, మాజీ హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం గారు గడపగడపకు వెళ్లి ప్రజల నుండి సంతకాలు సేకరించారు. ప్రజలు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మక్బూల్,మహమ్మద్ షఫీ, అజ్మతుల్లా, కో ఆప్షన్ సభ్యులు జహీర్,ఈస్ట్ జోన్ మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, మాజీ కార్పొరేటర్ పవర్ అల్తాఫ్,మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి జఫుల్లా, డివిజన్ అబ్జర్వర్లు గౌస్ పీర్, వెంకటరావు, నాయకులు అన్సర్, చాన్ అలీ, ఇమ్రాన్, సయ్యద్ జైద్,యాసర్, ఫయాజ్, అతహర్, అల్లా బకాష్, సలీం, బాబు భాయ్, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లాలో హంద్రీ నీవా నీటితో త్వరితగతిన చెరువులను నింపాలి

**జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి**





**కర్నూలు, పెన్ పవర్ నవంబర్ 07 :** ఉమ్మడి జిల్లాలో హంద్రీ నీవా నీటితో త్వరితగతిన చెరువులను పూర్తి స్థాయిలో నింపాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి గారి అధ్యక్షతన వ్యవసాయం - అనుబంధ శాఖలు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, మత్స్యశాఖ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ తదితర అంశాలపై నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కర్నూలు జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, కర్నూలు, నంద్యాల జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో హంద్రీ నీవా నీటితో ఎన్ని చెరువులను నింపారని ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.. 73 చెరువులకు గాను 45 చెరువులను పూర్తిస్థాయిలో నింపామని,మిగిలినవి పాక్షికంగా నింపామని అధికారులు వివరించారు. అన్ని చెరువులను త్వరితగతిన పూర్తి స్థాయిలో నింపాలని సూచించారు. రబీలో శెనగ విత్తనాలు రైతులకు ఎంతమేరకు పంపిణీ చేశారని వ్యవసాయ అధికారులను జిల్లా పరిషత్ చైర్మన్ ఆరా తీశారు.. ఇప్పటివరకు కర్నూలు జిల్లాలో 12 వేల క్వింటాళు ,,నంద్యాల జిల్లాలో 12 వేల క్వింటాళ్లు పంపిణీ చేయడం జరిగిందని వ్యవసాయ అధికారులు వివరించారు...శెనగల విత్తనాల పంపిణీ వేగంగా జరగాలని జిల్లా పరిషత్ చైర్మన్ అధికారులకు సూచించారు. వలసలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, అదే విధంగా పిల్లల కొరకు సీజనల్ హాస్టల్ లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు..... ఉపాధి హామీ కింద పొలాలకు రస్తాలు వేయిస్తే రైతులకు బాగుంటుందని తెలిపారు..అలాగే అవుకు, గోరుకల్లు రిజర్వాయర్ ల నుండి రబీకి నీటి విడుదల గురించి అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ ల నిర్వహణను సక్రమంగా, మరమ్మతులు సకాలంలో చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, తద్వారా రైతులకు సాగు నీటిని సజావుగా అందించవచ్చని చైర్మన్ అధికారులకు సూచించారు.

## కూటమి ప్రభుత్వం రైతులకు ఎప్పుడూ అండగా ఉంటుంది





**వీరబల్లి పెన్ పవర్ నవంబర్ 7 :** వీరబల్లి మండలం తాటి గుంటపల్లి గ్రామపంచాయతీలోనీ రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం సబ్సిడీపై ఉలవల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ వీరబల్లి మండల అధ్యక్షులు ఎం భానుగోపాల్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు రైతుల పట్ల ఎంతో ఉదార స్వభావంతో ఉంటారని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ తో పాటు మరెన్నో బతకాలను రైతులకు కావాల్సిన పనిముట్లను సబ్సిడీపై ఇస్తున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మండల అగ్రికల్చర్ ఆఫీసర్ స్వాతి గారు, తాటి గుంటుపల్లి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భాస్కర్ రాజు, మట్లి సొసైటీ డైరెక్టర్ దుర్గం ఆంజనేయులు, గ్రామ మహిళా అధ్యక్షురాలు జయంతమ్మ, మైనార్టీ నాయకులు దస్తగిరి , తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎల్లప్ప, బయప్ప, ఎస్టి గ్రామ నాయకురాలు కన్యాకుమారి, క్లస్టర్ నాయకులు వీరబల్లి మహేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ రచయ్య, తాటి గుంటపల్లి భూత్ కన్వీనర్ రాజ కొండ, తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాంజనేయ నాయుడు, రామచంద్ర, మైనార్టీ నాయకులు ఇబ్రహీం, ఖాదర భాష, తెలుగు యువత నాయకులు అవినాష్ రాజు, అశోక్ గజపతిరాజు, బంగారి, మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలో మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి : కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం పెన్ పవర్ నవంబర్ 7 :** క్రీడలో మానసిక శారీరక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతా యని క్రీడా స్ఫూర్తితో పోటీల్లో రెవెన్యూ క్రీడాకారులో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆర్డిటి స్టేడియంలో ఏడవ రెవెన్యూ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల నిర్వహణలో భాగంగా జరిగిన వివిధ క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ పరవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా క్రీడల క్రీడాకారులతో పరిచయం చేసుకొని వారిని ఉత్తేజపరిచారు. రెవెన్యూ క్రీడాకారులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని గెలుపు ఓటమిలు సహజమేనని స్నేహపూర్వక వాతావరణంలో మూడు రోజులు పాటు జరిగిన క్రీడా పోటీలు పండుగ వాతావరణం తలపిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం ఎంతోఆనందంగాఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను ఆయన అభినందించారు. అలాగే మహిళా క్రీడాకారులను కూడా ఎంతో ఆప్యాయంగా పలకరించి వారిని క్రీడా స్ఫూర్తినిపెంపొందించుకోవాలని సూచించారు. క్రికెట్, పరుగు పందెం తదితర పోటీలను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. రానున్న రెండు రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో క్రీడాకారులు ఆయా పోటీలలో పాల్గొనాలని తెలిపారు.

# కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ అల్లూరి జిల్లాలో ఏర్పాటు చేయాలి

* అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి



**కొయ్యూరు, పెన్ పవర్ నవంబర్ 7:**వైసిపి ప్రభుత్వ హాయములో కొయ్యూరు మండలం డౌనురులో స్థల సేకరణ చేసి ప్రాసెసింగ్ యూనిట్ కోసం శంకుస్థాపన చేస్తే మైదాన ప్రాంతంలో ఏర్పాటుకు సన్నాహాలు చేయడం కూటమి ప్రభుత్వానికి తగదని అరకు మాజీ ఎంపీ గోడ్డేటి మాధవి అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో మాజీ ఎంపీ మాధవి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఎక్కడ ఈ ప్రాసెసింగ్ యూనిట్ పెట్టిన గిరిజన ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆలోచనతో అప్పటి వైసిపి ప్రభుత్వం కొయ్యూరు మండలంలో ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం జరిగింది అన్నారు గిరిజనులు పండించే పంటపై వచ్చే ఆదాయం గిరిజనులకే ఉపయోగపడాలని ప్రాసెసింగ్ సెంటర్ ను డౌనురులో ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం వివిధ కారణాల పేరుతో నర్సీపట్నం నియోజవర్గం మాకవరపాలెంలో ప్రాజెక్ట్ యూనిట్ పెట్టి డౌనురులో మాత్రంగోడౌన్ క్రింద మాత్రమే వాడుకుంటామని అధికారులు ప్రకటించడం జరిగిందన్నారు. గొడవనుగా వాడుకుంటే ఎవరికి కనీసం ఉపాధి ఉండదని అదే ప్రాసెసింగ్ యూనిట్ వల్ల కొన్ని కుటుంబాలు కు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని గిరిజనులు పండించిన పంట వారికి ఉపయోగపడేలా ఉండాలని దీనిపై మరోసారి చర్చించి గిరిజన ప్రాంతాల్లో కొయ్యూరు మండలంలో దిగువునున్న గ్రామాల్లో ఏదో ఒక ప్రదేశంలో ప్రోసెసింగ్ యూనిట్ పెట్టాలని ఆమె అభిప్రాయపడ్డారు. అవసరమైతే ఈ విషయమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి లేఖ రాస్తామని ఆమె స్పష్టం చేశారు.

# 150 వసంతాల వందేమాతరం

* వందేమాతర గీతం ప్రాముఖ్యత తెలిపిన ఏపీఎస్ఆర్టీసీ విశాఖ రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు.



**విశాఖ తూర్పు,పెన్ పవర్. నవంబర్ 07:** వందేమాతరం గీతాన్ని ఆలపించి వందేమాతర గీతం యొక్క ప్రాముఖ్యతను తెలియపరచిన ఏపీఎస్ఆర్టీసీ విశాఖపట్నం రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు. శుక్రవారం విశాఖ ద్వారక బస్ స్టేషన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వందేమాతరం గీతానికి గల ప్రాముఖ్యత 150 సంవత్సరాల సందర్భాలను ఆర్టీసీ సిబ్బందికి వివరించారు.
ద్వారకా బస్ స్టేషన్ ఆవరణలో మరింత సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని,అదే విధంగా శబరిమల యాత్రకు ఏపీఎస్ఆర్టీసీ నుండి మంచి సదుపాయము కలగ చేస్తున్నామని, పంచరామాలకు మంచి విశేష స్పందన లభించిందని,ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకొని ఆన్లైన్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు.కార్యక్రమానికి డిప్యూటీ సిటిఎం కె.పద్మావతి. ఏటీఎం,ద్వారకా బస్సు స్టేషన్ కె.గంగాధర్,ఏ టీ ఏం(కమర్షియల్)బాపి రాజు, పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, సూపర్వైజర్లు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కూటమి ప్రభుత్వం హయాంలో అభివృద్ధి సాధ్యం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 7:**అల్లూరి సీతారామరాజు జిల్లా,గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ గేటు నుండి ఎంపీయూపీ పాఠశాల వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ పనులు జీకే వీధి ఎంపీటీసీ రిమెల రాజేశ్వరి నిధులతో, మండల పరిషత్ నిధుల ఆధారంగా చేపట్టబడ్డాయి.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ బోయిన కుమారి హాజరయ్యారు,ఎంపీటీసీ రిమెల రాజేశ్వరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి పట్ల కట్టుబడి ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి విస్తృతంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మండల పరిషత్ నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గోర్లే వీరవెంకట్, స్థానిక సర్పంచ్ కొర్ర సుభద్ర, ఎంపీటీసీలు నాగమణి, రాజులమ్మ, టిడిపి మాజీ మండల అధ్యక్షులు ముక్కలీ రమేష్, టీఎన్ఎస్ కార్యదర్శి ముక్కలీ కళ్యాణి, టిడిపి మాజీ జెడ్పీటీసీ గంట నలిని, జనసేన నాయకులు సురకత్తి నాగేశ్, గబులంగి గణేష్,అనిల్,శివ,గదుతూరి పరమేష్ వైఎస్సార్సీపీ నాయకుడు వంతల అరుణ్, బీజేపీ నాయకుడు రిమెల పాలు, తదితరులు పాల్గొన్నారు.

# బొడ్డాపుట్టు పంచాయతీ భవనం బొడ్డాపుట్టు గ్రామంలోని నిర్మాణం చేయండి..!



**పెన్ పవర్ హుకుంపేట నవంబర్ 7** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండలంలో గల బొడ్డపుట్టు పంచాయతీలో పంచాయతీ ఏర్పడిన నుంచి నేటి వరకు పంచాయతీ భవనం లేదని అధికారులకు పంచాయతీ ప్రజలు ఎన్నో మార్లు తమ గోడు విన్నవించుకోగా నేడు పంచాయతీ భవనానికి నిధులు సమకూర్చారు మరియు పంచాయతీ కేంద్రంలో భవన నిర్మాణానికి గతంలో స్థలం ఏర్పాటు చేశారని అక్కడ భవన నిర్మాణం కొరకు అధికారులు కొలతలు వేసి పనులు ప్రారంభించారని ఆ గ్రామ ప్రజలు అన్నారు అయితే కొంతమంది. వారి స్వలాభాల కోసం వేరే గ్రామంలో భవనం నిర్మించాలని అధికారులతో. నాయకులు మరి కొంతమంది గ్రామ పెద్దలు కుమ్మక్కయ్యారని దీంతో పంచాయతీ భవనాన్ని పంచాయతీకి సంబంధించిన వేరే ఊర్లో నిర్మాణం కొరకు యోచన చేశారని. అదే జరిగితే పంచాయతీ కేంద్ర ప్రజలను ఒప్పుకొని తీరేదే లేదని వారు అన్నారు అంతేకాకుండా గత పది రోజుల క్రితం నుంచి బొడ్డపుట్టు పంచాయతీలో భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో బోడ్డాపుట్టు ప్రజలు పంచాయతీ భవనాన్ని పంచాయతీ కేంద్రంలోని నిర్మించాలని నినాదాలు చేస్తూ ఉన్న ఎవరు స్పందించట్లేదని ఆ గ్రామ ప్రజలు వాపోయారు దీనికి సంబంధించిన అధికారులు స్పందించి మా పంచాయతీ భవనాన్ని మా గ్రామంలోనే నిర్మించండి అంటున్నారు ఈ కార్యక్రమంలో కొండిబా కృష్ణారావు కొండిబా అప్పలకొండ బాబు బోయిని సింహాచలం బోయిని అజిత్ చీకటి శ్రీనివాసరావు సత్తిబాబు సోమల సన్నీబాబు మరియు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు

# పెదవలసలో కాఫీ రైతుల ఆందోళన - సరైన నష్టపరిహారం ఇవ్వాలంటూ వాహనాల నిలుపుదల



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,నవంబర్ 7**:అల్లూరి సీతారామరాజు జిల్లా, గూడెం కొత్తవీధి మండలం పెదవలస పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఎన్.హెచ్. 516ఈ జాతీయ రహదారి నిర్మాణ పనుల వలన తమ కాఫీ తోటలు కోల్పోతున్నామని, సరైన నష్టపరిహారం అందకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం పెదవలస గ్రామంలో రైతులు నేషనల్ హైవే నిర్మాణ వాహనాలను నిలిపివేస్తూ నిరసన తెలిపారు.రైతులు మాట్లాడుతూ, తమ తోటల నష్టాన్ని ఏపీఎఫ్డీసీ అధికారులు ఇప్పటికే అంచనా వేశారని, ఆ అంచనాల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని, నేషనల్ హైవే అథారిటీలను పునరావృతంగా కోరుతున్నప్పటికీ స్పందన లభించలేదని పేర్కొన్నారు. "జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులను అనేకసార్లు కలిసి మన సమస్య వివరించాం. అనుమతి తీసుకొని శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష కూడా చేపట్టాం. అయినప్పటికీ, అధికారులు మా ఇబ్బందులను పట్టించుకోవడం లేదు," అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.వారు ఇంకా పేర్కొంటూ, "మా కాఫీ తోటలు దశాబ్దాల కష్టఫలితాలు. ఇప్పుడు రహదారి పేరుతో వాటిని కోల్పోతున్నాం. సరైన పరిహారం లేకుండా మా కుటుంబాలు జీవనాధారాన్ని కోల్పోతున్నాయి" అని అన్నారు.ప్రస్తుతం అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని రైతులకు సరైన నష్టపరిహారం చెల్లించకపోతే, ఆందోళన మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

# కోటి సంతకాల సేకరణతో వైసీపీ కి పెరుగుతున్న ఆదరణ



**విశాఖ తూర్పు, పెన్ పవర్ నవంబరు07:** జీవీఎంసీ 10 వ వార్డు46 వ బూత్ తోటగరువు ప్రాంతంలో వార్డు అధ్యక్షులు పతివాడ కనకరాజు. ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి సంతకాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు.పాల్గొన్నారు.కూటమి ప్రభుత్వ అమలు కానీ హామీలను ప్రజలకు తెలియపరుస్తూ,ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పి పి పి ప్రభుత్వ ఆస్తులను ప్రభుత్వము కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు పెట్టడంపై నిరసన తెలియపరుస్తూ వార్డు,నియోజకవర్గ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల నుండి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక 46వ బూత్ కన్వీనర్ తూర్పు నియోజకవర్గ వాలంటీర్ విభాగం అధ్యక్షులు మొల్లి వెంకటరమణ.మాజీ ఏపీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పతివాడ వెంకట లక్ష్మి.వార్డ్ మైనార్టీ సెల్ అధ్యక్షులు అబ్దుల్ సయ్యద్.రవీంద్ర చౌదరి,మొల్లి తనూజ, సారిపల్లి రామాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో ఉప్పొంగిన దేశభక్తి.






**గుమ్మలక్ష్మీపురం నవంబర్. 07 పెన్ పవర్.** మండలంలో రేగిడి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉప్పొంగిన దేశభక్తి,ఈ కార్యక్రమాన్ని శుక్రవారం నాడు పోస్టల్ డిపార్ట్మెంట్ ఊయక తిరుపతిరావు,మరియు గిరిజన ఆశ్రమ పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు.రేగిడి గ్రామ ప్రజలు గిరిజన ఆశ్రమం పాఠశాల విద్యార్థినిలు సుమారుగా 500 మంది పాల్గొని వందేమాతరం ఉత్సవాల్లో గీతా పాలన చేస్తూ వందేమాతరం పిరమిడ్ తో ప్రత్యక్షంగా ఆకర్షించి కార్యక్రమం నిర్వహించారు.ఈమేరకు తిరుపతిరావు మాట్లాడుతూ.స్వాతంత్ర ఉద్యమకారుడు బాకీన్ చంద్ర చాటర్జీ వందేమాతరం గీతం 1875,నవంబర్ 7,అక్షయ నవమి రోజు రచించారని.స్వాతంత్ర ఉద్యమానికి అప్పటిలో స్ఫూర్తి ఇస్తూ,ప్రస్తుతం భారత ప్రధాని పిలుపు మేరకు దేశంలో 29 రాష్ట్రాల్లో ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలు కుల మాత అతీతంగా విద్యారులు,ఉద్యోగులు,నిరుద్యోగులు వ్యాపారస్తులు,వివిధ సంఘ నాయకులు 140 కోట్ల ప్రజానీకానికం దేశంపై గౌరవం,నిజాయితీ, అభిమానం, ఐక్యత,సంకల్పం ఇప్పటి విద్యార్థుల నుండి పౌరులు వరకు ఒకే సిద్ధాంతం తెలిపేది ఈ వందేమాతరం గీతమని,అప్పటి పోరాట ఉద్యమాల్లో ఆలపించే అవకాశం లేనప్పటికీ అప్పటి స్వతంత్ర యోధులను తలుచుకుంటూ ఈనాడు ఈ శుభ సందర్భంగాలో ఈ గేయాన్ని భారత పౌరునిగా వారందర్నీ స్మరిస్తూ ఆలపించడం అదృష్టంగా భావించి విద్యార్థులకు ఈ సందేశాన్ని దిశ నిర్దేశం ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు.కార్యక్రమంలో మారుమూల గిరిజన ప్రాంతాల నుండి ఆదివాసి గ్రామాల విద్యార్థులు ఉద్యోగులు యువకులు పాల్గొనడం చాలా ఆనందకరంగా ఉందనిఅన్నారు, అవసరమైతే దేశ శ్రేయస కొరకు ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉండాలని పిలుపునిస్తూ తల్లి తండ్రి.గుడి బడి.దేశం దేశభక్తి.ఇవి విద్యార్థుల్లో ఉండాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయురాలు బి.స్వాతి,ఉపాధ్యాయ సిబ్బంది.మండల పరిష త్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.తిరుమల, మరియు సిబ్బంది,రేగిడి పిహెచ్సి వైద్య అధికారి ఎం సాహితీ, మెడికల్ అధికారి కృష్ణంరాజు,రాజేశ్వరి, బి రాము,సిబ్బంది, అలాగే సచివాలయం సిబ్బంది.సెక్రటరీ శంకర్రావు,డిజిటల్ అసిస్టెంట్ రమ, సోమేశ్వరరావు. అంగన్వాడి సిబ్బంది. మరియు రేగిడి గ్రామ యువత.ఈశ్వరరావు,కిషోర్ ఆనందు నరేష్ మహిళా సంఘాలు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌ను జయించొచ్చు ముందస్తు పరీక్షలే రక్షణ కవచం

జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా కేజీహెచ్‌లో ర్యాలీ నిర్వహణ






**విశాఖ దక్షిణం పెన్ పవర్, నవంబర్ 07** :జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా కింగ్ జార్జ్ హాస్పిటల్‌లో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సమాజంలో జీవనశైలి మార్పులు, ఆహారపు అలవాట్ల ప్రభావంతో అసంక్రమిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని వైద్యులు వెల్లడించారు. రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులతో పాటు క్యాన్సర్ కేసులు కూడా గణనీయంగా పెరుగుతున్నాయని తెలిపారు.ప్రతి సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా వేలాది కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నప్పటికీ, వాటిలో చాలా భాగం ఆలస్యంగా గుర్తించబడటం వల్ల రేడియో, కీమో చికిత్సల అవసరం పెరుగుతోందని, చివరికి ప్రాణనష్టం ఎక్కువగా జరుగుతోందని వైద్య నిపుణులు ఆవేదన వ్యక్తం చేశారు.సకాలంలో గుర్తింపు, నిరంతర స్క్రీనింగ్ పరీక్షలే ప్రాణరక్షకమని కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ. వాణి తెలిపారు. "బీపీ, షుగర్ పరీక్షలతో పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ కూడా అంతే ముఖ్యమైనది. క్యాన్సర్ అనేది భయపడాల్సిన వ్యాధి కాదు. ముందుగానే గుర్తిస్తే పూర్తిగా నయం చేయగల వ్యాధి ఇది" అని ఆమె పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం 18 ఏళ్ల పైబడిన ప్రతి పౌరుడికి నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లకు ఉచిత స్క్రీనింగ్ సదుపాయం కల్పించినట్లు ఆమె తెలిపారు. ఈ సేవలను ఇంటింటికీ వెళ్లే ప్రభుత్వ ఆరోగ్య సిబ్బంది ద్వారా లేదా సమీ పంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పొందవచ్చని చెప్పారు. ప్రజలు మొహమాటం లేకుండా ఈ పరీక్షలు చేయించుకోవాలని, ముఖ్యంగా మహిళలు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు.అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారిని వెంటనే మెడికల్ కాలేజీ ఆసుపత్రుల ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్లకు రిఫర్ చేసి ఉచితంగా ప్రత్యేక చికిత్స అందించే ఏర్పాట్లు ప్రభుత్వం చేపట్టిందని వివరించారు.
ఈ కార్యక్రమంలో ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. కె.వి.ఎస్.ఎం. సంధ్య దేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి. జగదీశ్వరరావు, మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డా. కె. శిల్ప, ప్రివెంటివ్ అంకాలజీ నోడల్ అధికారి డా. కె. సాయి సుష్మ, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డా. హారికతో పాటు పలు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఈవెంట్లతో మెరిసిపోనున్న విశాఖ

**విశాఖపట్టణం, నవంబర్ 7 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖ ఇప్పుడు అంతర్జాతీయ ఈవెంట్లకు వేదికగా మారుతోంది. విశాఖ నగరం పలు కీలక అంశాలకు వేదికగా నిలుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో జరగనున్న పలు వేడుకలకు ఆతిథ్యం ఇవ్వబోతోంది. దేశ విదేశాల నుంచి అంతర్జాతీయ ప్రముఖులు విశాఖ వస్తున్నారు. అందుకే నిఘా పెంచారు. పటిష్టమైన భద్రత వ్యవస్థను నెలకొల్పుతున్నారు. అదే సమయంలో వచ్చే అతిథులు మంత్ర ముగ్ధులయ్యేలా నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. సిటీ బ్యూటీఫికేషన్ తో పాటుగా సరికొత్తగా నగరంలోని ప్రముఖ కూడళ్లను తీర్చిదిద్దుతున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ విభాగాలన్నీ పూర్తి స్థాయిలో పనులు చేయిస్తున్నాయి. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖ వేదికగా క%వ%న్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో పెట్టుబడుదారుల సదస్సు జరగబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సమ్మిట్ ను నిర్వహిస్తోంది. ఆంధ్రాయూనివర్సిటీ ఇంజనీరింగ్ గ్రౌండ్ లో జరగనున్న ఈ సదస్సు దేశంలోని ప్రముఖ వ్యాపార వేత్తలతో పాటుగా అంతర్జాతీయ స్థాయి వ్యాపార దిగ్గజాలు, వాణిజ్య సంస్థలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యే అవకాశం ఉంది. దాదాపుగా రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడుల సమీకరణ లక్ష్యంగా సమ్మిట్ నిర్వహిస్తుండటంతో విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు, నగర సుందరీకరణ పనలు చేపడుతున్నారు. నారా లోకేష్ స్వయంగా ఏర్పాట్లను చూసుకుంటున్నారు.భారత నావికాదళానికి అత్యంత కీలకమైన విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నావికాదళం దేశ రక్షణకు సంబంధించిన ప్రతిష్టాత్మక వేడుకలను విశాఖలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 2026 ఫిబ్రవరి 15 నుంచి 25 వరకు ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ ఆర్) జరగనుంది. పలు ప్రపంచ దేశాలకు చెందిన నావికాదళాలు ఈ వేడుకలకు హాజరై తమ నౌకాదళ అస్త్రాలు, ఆయుధ సంపత్తి శక్తి సామర్థ్యాలను ప్రదర్శించబోతున్నాయి. ఈ కార్యక్రమానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా హాజరుకానున్నారు. అలాగే మన నౌకాదళానికి చెందిన ఐఎన్ ఎస్ విక్రాంత్ జలాంతర్గామి నుంచి ఆయుధ సంపత్తిని రాష్ట్రపతి పరిశీలిస్తారు.మిలాన్ పేరిట నౌకాదళానికి చెందిన మరో కీలక వేడుకకు కూడా విశాఖ ఆతిధ్యం ఇవ్వబోతోంది. పలు దేశాలకు చెందిన నౌకాదళాలు, కోస్టు గార్డులు మిలాన్ వేడుకలకు హాజరుకానున్నాయి. సాగర తీరంలో తమ విన్యాసాలను ఈ మిలాన్ లో భాగంగా ప్రదర్శించబోతున్నాయి. సిటీ పరేడ్ అత్యంత ఆకర్షణగా నిలబోతోంది. అలాగే భారత నావికాదళం ఆధ్వర్యంలో పలు దేశాలకు నేవీ అధిపతులు సదస్సు కూడా జరగనుంది. పలు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరుచుకోవడం, పరస్పరం సమాచారం అందిపుచ్చుకోవడం, పకడ్బందీ భద్రతపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఇలా అంతర్జాతీయంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన సదస్సులకు విశాఖ వేదిక కావడంతో అంతర్జాతీయంగా పేరు మార్మోగనుంది.

# రాయలసీమలో రూ. 22 వేల కోట్లు పెట్టుబడులు

**తిరుపతి, నవంబర్ 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులు రానున్నాయి. రూ. 22 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ సిద్ధమైంది. పునరుత్పాదక విద్యుత్తు, బయోమాస్, డేటా సెంటర్లు, పోర్టుల రంగాల్లో ఈ పెట్టుబడులు పెట్టనుంది. త్వరలో విశాఖపట్నంలో జరగనున్న సీసీఐ భాగస్వామ్య సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వం, కంపెనీ మధ్య అవగాహన ఒప్పంద కుదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 77 వేల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా.ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడి రానుంది. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్తు, బయోమాస్, డేటా సెంటర్లు, పోర్టుల రంగాల్లో.. రూ.22,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా 7000 మందికి, పరోక్షంగా 70 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని అంచనా. కాగా, విశాఖపట్నంలో నవంబర్ 14, 15 తేదీల్లో జరగనున్న సీసీఐ భాగస్వామ్య సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ మధ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని సమాచారం.రాయలసీమలోని కడప, కర్నూలు జిల్లాల్లో.. 1,750 మెగావాట్ల సోలార్/ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం ప్రాజెక్టులు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ , సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా టెండర్లలో భాగంగా ఎస్ఏఈఎల్ ఈ ప్రాజెక్టులు చేపడుతోంది. పరిశ్రమలు, డేటా సెంటర్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడం లక్ష్యంగా వీటిని నిర్మిస్తున్నారు. అంతేకాకుండా 200 మెగావాట్ల బయోమాస్ ప్రాజెక్టును చేపడుతున్నారు. అందులో భాగంగా 25 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పలు బయోమాస్ ప్లాంట్లను నిర్మిస్తారు. వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.అంతేకాకుండా, రూ. 3000 కోట్లతో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న డిజిటల్ అవకాశాలు వినియోగించుకోవచ్చు. మారిటైం రంగంలో లాజిస్టిక్స్‌ను, ఎగుమతులను బలోపేతం చేసేందుకు రూ.4000 కోట్ల పెట్టుబడితో పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. కాగా, తమ కంపెనీ ఇప్పటికే ఏపీలో రూ. 3,200 కోట్లు పెట్టుబడులు చేసినట్లు ఎస్ఏఈఎల్ తెలిపింది. 9 నెలల్లో 600 మెగావాట్ల సామర్థ్యాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపింది.కాగా, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ల నెట్వర్క్ ఏర్పాటు, గ్రీన్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ అభివృద్ధి చేసేందుకు రూ.20 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఇటీవల హిందూజా గ్రూప్ ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే.తర్వాత శుద్ధ ఇంధనం (క్లీన్ ఎనర్జీ) రంగంలో ఏపీకి భారీ పెట్టుబడులు వచ్చాయి. కర్నూలు జిల్లాలో బ్రూక్ ఫీల్డ్ చేపట్టనున్న రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కోసం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (%=జుజ%) రూ.7,500 కోట్ల నిధులు మంజూరు చేసింది. మొత్తం రూ.9,910 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. అందులో భాగంగా 640 మెగావాట్ల పవన విద్యుత్, 400 మెగావాట్ల సౌర శక్తితో.. మొత్తంగా 1040 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా, ఇప్పటివరకు ఒక ప్రైవేట్ ప్రాజెక్టుకు ఆర్ఈసీ.. ఇంత భారీ మొత్తంలో నిధులు ఇవ్వడం ఇదే మొదటిసారి అని అధికార వర్గాలు వెల్లడించాయి.

# గ్రామ సచివాలయాలు కాదు ఇక విజన్ యూనిట్స్ -

**విజయవాడ, నవంబర్ 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు గ్రామ సచివాలయాల పేరును 'విజన్ యూనిట్స్'గా మారుస్తున్నట్లుగా ప్రకటించారు. ఇక నుంచి ఈ యూనిట్లు ప్రజలకు సేవలు సమర్థవంతంగా అందించే కేంద్రాలుగా రూపొందుతాయని ప్రకటించారు. రాష్ట్రంలోని 13,326 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఈ మార్పు 2024 ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా వచ్చిన 'స్వర్ణాంధ్ర విజన్ 2047'కు అనుగుణంగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. అమరావతిలో డేటా డ్రివెన్ గవర్నెన్స్ పై జరిగిన సమావేశంలో చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. గ్రామ సచివాలయాలను మరింత ఎఫెక్టివ్‌గా మార్చాల్సి ఉందని.. చంద్రబాబు భావిస్తున్నారు. ఇక నుంచి వీటిని 'విజన్ యూనిట్స్'గా పిలుస్తామని.. ఇవి ప్రజలకు సేవలు అందించే కేంద్రాలుగా మాత్రమే కాకుండా, గ్రామీణ వికాసానికి విజనరీ ప్లాన్‌లు రూపొందించే యూనిట్లుగా పనిచేయాలని చంద్రబాబు భావిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను జగన్ సీఎంగా ఉన్నప్పుడు తీసుకు వచ్చారు. ప్రతి రెండు వేల మందికి ఓ సచివాలయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, పట్టణాల్లో వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారు. వాటిలో ఒక్కో దాంట్లో పదమూడు మంది సిబ్బందిని నియమించారు. పంచాయతీ కార్యాలయాలు చేయాల్సిన పనులన్నీ గ్రామ, వార్డు సచివాలయాలు చేయడం ప్రారంభించాయి. అదే సమయంలో సిబ్బందికి పని ఉండటం కష్టమయింది. నియామకాలపైనా ఎన్నో వివాదాలు వచ్చాయి. ప్రభుత్వం మారిన తరవాత సచివాలయ ఉద్యోగుల్ని ఎక్కువగా ఎలా ఉపయోగించుకోవాలన్నదానిపై కసరత్తు జరిపారు. వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తూ వస్తున్నారు. కొంత మందితో పెన్షన్లు పంపిణీ చేయిస్తున్నారు. మిగిలిన వారికి కొత్త బాధ్యతలు అప్పగించాలని.. మొత్తం వ్యవస్థను సంస్కరించాలని నిర్ణయించారు. అందుకే విజన్ యూనిట్స్ గా మార్చాలని డిసైడయ్యారు.

# రాజకీయాలకు దూరంగా తమిళ సినిమాలకు దగ్గరగా...

**విజయవాడ, నవంబర్ 7, పెన్ పవర్:**
ఏపీ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ ముద్ర సంపాదించుకున్నారు మాజీ మంత్రి ఆర్కే రోజా. కానీ ఇటీవల ఏపీ రాజకీయాల్లో పెద్దగా కనిపించడం లేదు. తాడేపల్లి వైపు కూడా రావడం మానేశారు. సొంత నియోజకవర్గ నగరిలో అప్పుడప్పుడు హడావిడి చేస్తున్నారు. రికార్డింగ్ వీడియోలను మీడియాకు విడుదల చేసి ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నారు. అది కూడా ఏదో ఒక ప్రత్యేక సందర్భంలోనే. అయితే రాజకీయాలను క్రమేపి విడిచి పెట్టాలన్న ఆలోచనలో రోజా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే తెలుగు నాట ఉండకుండా.. తమిళనాడులో సెటిలై పోవాలన్న ఆలోచనలో ఆమె ఉన్నట్లు సమాచారం. తమిళ సినీ పరిశ్రమలో ఇప్పుడు గట్టి అవకాశాల కోసం రోజా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.మాజీ మంత్రి రోజా ఇటీవల మీడియాలో కూడా కనిపించడం లేదు. అయితే వైసిపి నాయకత్వం ఆమెను వద్దనుకుందా? లేకుంటే ఆమె బయటకు వెళ్లిపోయిందా అన్నది తెలియడం లేదు. ఎందుకంటే అప్పుడప్పుడు కూటమి ప్రభుత్వంపై రోజా విమర్శలు చేస్తూనే ఉన్నారు. అయితే రోజా లాంటి నేతలు ఉంటే తాము పార్టీలో ఉండలేమని కొంతమంది వైసీపీ సీనియర్లు తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. అందుకే వెనువెంటనే శ్యామలాన్ని తీసుకొచ్చి అధికార ప్రతినిధిని చేసినట్లు ప్రచారం సాగుతోంది. కేవలం రోజాకు మాత్రం అవసరమైన సమయంలో కంటెంట్ పంపించి మాట్లాడిస్తున్నట్లు సమాచారం. అయితే పొమ్మనలేక ఆమెను పొగ పెట్టినట్లు వైసిపి వర్గాల్లో ప్రచారం సాగుతోంది. రోజా సైతం ఈ సమీక్షలకు హాజరు కావడం లేదు. తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో కూడా పెద్దగా కనిపించడం లేదుతెలుగు చిత్ర పరిశ్రమతో పాటు బుల్లితెరపై ఒక వెలుగు వెలిగారు రోజా. కానీ రాజకీయాల్లో దూకుడు తనం ప్రదర్శించి హుందాతనాన్ని పోగొట్టుకున్నారు. దాని పర్యవసానాలు ఇప్పుడు అనుభవిస్తున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో సరైన అవకాశాలు దక్కడం లేదు. అందుకే తమిళ చిత్ర పరిశ్రమపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. తాజాగా లెనిన్ పాండియన్ అనే



సినిమాలో రోజా నటిస్తున్నట్లు సమాచారం. అందులో వృద్ధురాలిగా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్ర దక్కినట్లు తెలుస్తోంది. ఆ పాత్ర సక్సెస్ అయితే ఆమెకు మరిన్ని అవకాశాలు వచ్చే పరిస్థితి ఉంది. హీరోయిన్గా తమిళనాడులో ఒక ఊపు ఊపారు రోజా. కానీ తెలుగు చిత్ర పరిశ్రమతో పాటు రాజకీయాల్లో ప్రవేశించి రాణించారు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏపీలో ఉంటే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని ఆమె గుర్తించినట్లు సమాచారం. ఆమె వల్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందన్న వారు కూడా ఉన్నారు. అందుకే సొంత పార్టీలో ప్రత్యర్థులను ఎదుర్కోలేక.. కూటమి దూకుడు తట్టుకోలేక ఏపీ రాజకీయాలను విడిచి పెడుతున్నట్లు తెలుస్తోంది.కూటమి ప్రభుత్వం రోజా విషయంలో దూకుడుగా ఉన్నట్లు ప్రచారం సాగింది. వైసిపి హయాంలో

ఆమె క్రీడల శాఖ మంత్రిగా వ్యవహరించారు. ఆ సమయంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా భారీగా అవినీతి జరిగిందన్నది కూటమి ప్రభుత్వం ఆరోపణ. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విజిలెన్స్ విచారణ సాగింది. ఆ విచారణ నివేదిక ప్రభుత్వానికి వచ్చింది. రోజా అరెస్టు ఖాయమని ప్రచారం సాగింది. అది మొదలు రోజా ఏపీలో కనిపించకుండా మానేశారు. ఆపై తమిళ చిత్ర పరిశ్రమలో అవకాశాలు దక్కుతుండడంతో.. ఇక రాజకీయాలకు రోజా దూరమవుతారని ప్రచారం సాగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి

# లూలూ గ్రూప్ పై ప్రేమ ఎందుకో...

**విజయవాడ, నవంబర్ 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లూలూ గ్రూప్‌కు విశాఖపట్నం, విజయవాడలో ప్రధాన భూములు లీజ్‌పై అలాట్ చేయడం వెనుక భారీ సబ్సిడీలు, రివర్షన్ క్లాజ్‌లు లేకుండా లీజ్‌లు ఇవ్వడం వంటి నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఇటీవలే అహ్మదాబాద్‌లో 519 కోట్ల రూపాయలకు 16 ఎకరాలు కొన్న లూలూ ఇంటర్నేషనల్ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఏపీలో మాత్రం ప్రభుత్వ భూములను 'సబ్సిడీ' రూపంలో తక్కువ రేట్‌లో తీసుకుంటూ, విలువైన ఆస్తులను కార్పొరేట్ లాభాలకు మార్చుకుంటోంది. అహ్మదాబాద్‌లోని చంద్‌ఖేడా ప్రాంతంలో లూలూ గ్రూప్ 16.35 ఎకరాల ప్రధాన భూమిని 519.41 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. ఈ డీల్ అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తో జరిగింది, ఇక్కడ లూలూ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మార్కెట్ రేట్‌లో పూర్తి చెల్లింపు చేసి, రికార్డు స్థాయి 31.16 కోట్ల రూపాయల స్టాంప్ డ్యూటీ చెల్లించింది. ఈ భూమిపై మెగా మాల్ నిర్మాణం ప్రణాళికలో ఉంది, ఇది గుజరాత్‌లోని రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు ఊపునిస్తోంది. ఈ డీల్ ఏపీలో జరుగుతున్న అలాట్‌మెంట్‌లతో పోల్చితే పూర్తి భిన్నంగా ఉంది. అహ్మదాబాద్‌లో ప్రభుత్వ సబ్సిడీలు లేకుండా, పూర్తి మార్కెట్ విలువతో కొనుగోలు చేసిన లూలూ, ఏపీలో మాత్రం ప్రభుత్వ భూములను తక్కువ రేట్‌లో లీజ్‌పై తీసుకుని, "సబ్సిడీ"లా మార్చుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025 జులైలో జారీ చేసిన %+ూ 137 ,,,, +ూ% 45 ప్రకారం, విశాఖపట్నంలో 13.74 ఎకరాలు, విజయవాడలో 4.15 ఎకరాలు ఆర్టీసీ భూములను లూలూ గ్రూప్‌కు లీజ్‌పై అలాట్ చేసింది. విశాఖలో భూములు హార్బర్ పార్క్ సమీపంలో, బీచ్ వద్ద ఉన్న ప్రధాన ప్రదేశాల్లో ఉన్నాయి. విలువ సుమారు 2,000 కోట్ల రూపాయలు ఉంటుంది. ఆంధ్రా టూరిజం ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ 2024-29 ప్రకారం, 65 సంవత్సరాల లీజ్ (మరో 33 సంవత్సరాలు పొడిగించుకోవచ్చు) ఇచ్చారు, కానీ రివర్షన్ క్లాజ్ (ప్రాజెక్ట్ ఫెయిల్ అయితే భూమి తిరిగి ప్రభుత్వానికి) లేకపోవడం, తక్కువ రేట్ లో ఇవ్వడం వంటి అంశాలు వివాదానికి కారణమయ్యాయి. విజయవాడలో మాల్ ప్రాజెక్టుకు 1,222 కోట్ల పెట్టుబడి ప్రకటించినప్పటికీ, భూమి అలాట్‌మెంట్‌లో పారదర్శకత లేకపోవడం వల్ల ప్రజలు, రైతు సంఘాలు నిరసనలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులు 10,000 ఉద్యోగాలు సృష్టిస్తాయని ప్రభుత్వం చెప్పినా ఆ ఉద్యోగాలు ఎవరికిస్తారన్నదానిపైనా విమర్శలు ఉన్నాయి. వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు ఈ ల్యాండ్ అలాట్‌మెంట్ ను వ్యతిరేకిస్తున్నాయి. విజయవాడ భూమిని ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్లు %+ూ% 137ను వ్యతిరేకిస్తూ, భూములు మాల్‌లకు మార్చడం వల్ల పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ బలహీనపడుతుందని హెచ్చరించాయి. సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్లు విజగ్‌లో 14 ఎకరాల ప్రైమ్ ల్యాండ్‌ను ఉచితంగా ఇవ్వడాన్ని "ప్రభుత్వ అనైతికత"గా అభివర్ణించాయి. "లూలూ ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బూస్ట్ ఇస్తాయి" అని ప్రభుత్వం వాదిస్తోంది. అహ్మదాబాద్‌లో మార్కెట్ రేట్‌లో పెట్టుబడి చేసిన లూలూ, ఏపీలో సబ్సిడీలతో భూములు తీసుకోవడం వల్ల "డబుల్ స్టాండర్డ్" ఆరోపణలు ఎదుర్కొంటోంది. వైసీపీ, సీపీఎలులు రద్దు డిమాండ్ చేస్తుంటే,టీడీపీ ప్రభుత్వం "ఉద్యోగాలు, పెట్టుబడి"ని హైలైట్ చేస్తోంది. పరిశ్రమలకు అంటే సరే..కానీ మాల్స్ కు కూడా భూమిని ఎందుకు సబ్సిడీకి ఇవ్వాలన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఇప్పుడు బడా కంపెనీలు విశాఖకు వస్తున్నందున.. ఆ భూమిని వేలం వేస్తే.. కంపెనీలు కొనుగోలు చేసి పెద్ద మాల్స్ నిర్మిస్తాయని అంటున్నారు. ప్రభుత్వం ఇలాంటి వాటికి సమాధానం చెప్పకపోతే.. లూలుతో కుమ్మక్కయ్యారని ప్రజలు అనుకునే అవకాశం ఉంది.

# 25 లక్షలకుపైగా ఇళ్లకు కుళాయి కనెక్షన్లు



**శ్రీకాకుళం, నవంబర్ 7, పెన్ పవర్:** ఏపీలో తాగునీటి కష్టాలు తీరనున్నాయి. కుళాయి ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందించేందుకు కేంద్రం చేపట్టిన జల్ జీవన్ మిషన్‌లో ఆగిపోయిన పనులను పూర్తి చేసేందుకు.. కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగా జాతీయ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి బ్యాంకు నుంచి రూ. 10వేల కోట్ల రుణం తీసుకునేందుకు సిద్ధమైంది. ఈ విషయంపై బ్యాంకు అధికారులతో ఏపీ ప్రభుత్వం ప్రతినిధులు చర్చలు జరిపారు. దీంతో రుణం ఇచ్చేందుకు బ్యాంకు అంగీకరించింది. లోన్ మొత్తాన్ని మూడు విడతల్లో విడుదల చేస్తామని బ్యాంకు ప్రాథమికంగా తెలిపింది. అయితే ఈ రుణానికి సంబంధించిన ప్రతిపాదనలు బ్యాంకు టెక్నికల్ ఫీజిబిలిటీ కమిటీ పరిశీలనలో ఉన్నాయి. ఆ కమిటీ ఆమోదిస్తే.. ఈ నెల చివర్లో లోన్ మంజూరు అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.తాగునీటి కుళాయి కనెక్షన్ ప్రాజెక్టు డీపీఆర్‌కు ఆమోదం లభించిన తర్వాతే ఈ నిధులు మంజూరు కానున్నాయి. ప్రజలకు మంచినీరు సరఫరా చేసేందుకు గత ప్రభుత్వంలో బోరు బావుల నుంచి నీరు సేకరించేవారు. అయితే వేసవిలో భూగర్భజలాలు అడుగంటినప్పుడు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కూటమి ప్రభుత్వం గుర్తించింది. అందుకే ప్రణాళికలు మార్చి.. నదులు, జలాశయాల నుంచి నీరు సేకరించేలా.. వాటిని కుళాయిల ద్వారా ప్రజలకు రక్షిత మంచినీరు ఏడాది పొడవునా అందించేలా రూ.84,500 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారుచేయించింది. ఈ డీపీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం లభిస్తేనే %ఛీుదీఖీ×ణ% రుణం మంజూరు చేస్తుంది.జల్జీవన్ మిషన్‌లో భాగంగా... కేంద్ర ప్రభుత్వం మొదట ఆమోదించిన రూ.27వేల కోట్ల ప్రాజెక్టును పూర్తి చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని కూటమి ప్రభుత్వం ఆరోపిస్తోంది. రాష్ట్రం వాటా నిధులు సరిగా కేటాయించలేదని.. 2019-24 మధ్య రూ. 4 వేల కోట్లకు మించి వినియోగించుకోలేదని ఆరోపించింది. పనులు కూడా అరకొరగా చేపట్టిన కారణంగా.. తాగునీటి సరఫరా చేయలేకపోయిందని చెబుతోంది. ఈ నేపథ్యంలో పెండింగ్ పనులను తాము పూర్తి చేయడంపై దృష్టి సారించామని వెల్లడించింది. అందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న రూ. 23 వేల కోట్ల విలువైన పనులు పూర్తిచేసి ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్న కేంద్రప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపింది.మొత్తం రూ. 23 వేల కోట్లలో... రుణం ద్వారా రూ. 10 వేల కోట్లు ఏపీ ప్రభుత్వం తమ వాటా కింద సమకూర్చుతోంది. మిగతా రూ. 13 వేల కోట్లు కేంద్రం ఇవ్వనుంది. పెండింగ్ పనులను వచ్చే రెండు, మూడేళ్లలో పూర్తిచేసి.. 25 లక్షలకుపైగా ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. శ్రీకాకుళం, అనకాపల్లి, పల్నాడు, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం, విజయనగరం, కర్నూలు, అనంతపురం వంటి వెనుకబడిన జిల్లాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోంది.

## సెంచరీతో జురెల్ ఒంటరి పోరాటం.. సౌతాఫ్రికాతో తొలి టెస్టులో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఛాన్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ ధృవ్ జురెల్ ప్రస్తుతం సూపర్ ఫామ్ తో దూసుకెళ్తున్నారు. ఇటీవలే వెస్టిండీస్ తో జరిగిన తొలి టెస్టులో సెంచరీ చేసి సత్తా చాటిన ఈ వికెట్ కీపర్.. గురువారం (నవంబర్ 6) సౌతాఫ్రికా-ఏ తో జరిగిన మ్యాచ్ లో సెంచరీతో దుమ్ములేపాడు. జట్టు మొత్తం విఫలమైనా ఒక్కడే సెంచరీతో పోరాడి జట్టును ఆదుకున్నాడు. 175 బంతుల్లో 132 పరుగులు చేసి జట్టు మొత్తం స్కోర్ లో సగం పరుగులు చేశాడు. జురెల్ ఇన్నింగ్స్ తో తొలి ఇన్నింగ్స్ లో ఇండియా-ఏ 255 పరుగులకు ఆలౌటైంది. జురెల్ సెంచరీతో భారత ప్లేయింగ్ 11 లో చోటు దాదాపు కన్ఫర్మ్ అయింది.

సౌతాఫ్రికాతో నవంబర్ 14 నుంచి జరగబోయే తొలి టెస్టులో వికెట్ కీపర్ గా కాకుండా స్పెషలిస్ట్ బ్యాటర్ గా బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. వెస్టిండీస్ తో జరిగిన టెస్ట్ సిరీస్ కు పంత్ గాయం కారణంగా అందుబాటులో లేకపోవడంతో జురెల్ తుది జట్టులో స్థానం సంపాదించి తనను తాను నిరూపించుకున్నాడు. పంత్ గాయం ఉంచి కోలుకొని సౌతాఫ్రికా టెస్ట్ సిరీస్ కు ఎంపిక కావడంతో జురెల్ మరోసారి బెంచ్ కు పరిమితమనుకున్నారు. అయితే సూపర్ ఫామ్ లో ఉండడంతో జురెల్ మిడిల్ ఆర్డర్ లో బ్యాటింగ్ చేసే అవకాశం ఉంది. మరో టీమిండియా యాజమాన్యం ఏం చేస్తుందో చూడాలి.

ఈ మ్యాచ్ విషయానికి వస్తే సౌతాఫ్రికా - ఎతో గురువారం ప్రారంభమైన రెండో అనధికార టెస్ట్‌లో ఇండియా టాప్ ఆర్డర్ ఫెయిలైంది. ధ్రువ్ జురెల్ (132 నాటౌట్) సెంచరీతో చెలరేగినా.. మిగతా బ్యాటర్లు నిరాశపర్చడంతో భారీ స్కోరు చేయలేకపోయింది. దీంతో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇండియా - ఎ తొలి ఇన్నింగ్స్‌లో 77.1 ఓవర్లలో 255 రన్స్‌కు ఆలౌటైంది. ఆరంభం నుంచి సఫారీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. టియాన్ వాన్ వురెన్ (4/52), షెపో మోరెకి (2/52), ప్రేనేలన్ సుబ్రాయెన్ (2/73) వరుస విరామాల్లో వికెట్లు తీసి ఇండియా స్కోరు బోర్డును అడ్డుకున్నారు.ఓపెనర్లు
కేఎల్ రాహుల్ (19), అభిమన్యు ఈశ్వరన్ (0), సాయి సుదర్శన్ (17), దేవదత్ పడిక్కల్ (5), కెప్టెన్ రిషబ్ పంత్ (24) నిరాశపర్చారు. 86/5తో కష్టాల్లో పడిన ఇండియా ఇన్నింగ్స్‌ను జురెల్ సెంచరీతో నిలబెట్టాడు. కానీ రెండో ఎండ్‌లో అతనికి సరైన సహకారం దక్కలేదు. హర్ష్ దూబే (14), ఆకాశ్ దీప్ (0) ఫెయిలయ్యారు. ఈ దశలో కుల్దీప్ యాదవ్ (20) మెల్లగా ఆడి ఎనిమిదో వికెట్‌కు 79 రన్స్ జోడించడంతో ఇన్నింగ్స్ కాస్త కోలుకుంది. కానీ కుల్దీప్ ఔటైన తర్వాత సిరాజ్ (15), ప్రసిధ్ కృష్ణ (0) వెంటవెంటనే వెనుదిరగడంతో ఇండియా ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌతాఫ్రికా 221 పరుగులకు ఆలౌటైంది.

## రేపటితో (నవంబర్ 8) ఆస్ట్రేలియా టూర్‌కు ముగింపు.. టీమిండియా నెక్స్ట్ షెడ్యూల్ ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టు ప్రస్తుతం ఆస్ట్రేలియా టూర్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ టూర్ లో భాగంగా మొదట మూడు వన్డేలు ఆడిన టీమిండియా 1-2 తేడాతో సిరీస్ కోల్పోయింది. ప్రస్తుతం టీ20 క్రికెట్ ఆడుతున్న మన జట్టు 2-1 ఆధిక్యంలో నిలిచారు. శనివారం (నవంబర్ 8) చివరి టీ20లో గెలిస్తే సిరీస్ 3-1 తేడాతో గెలుచుకోవచ్చు. ఒకవేళ ఓడిపోతే 2-2 తో సిరీస్ సమం అవుతుంది. ఆస్ట్రేలియాతో టూర్ ముగిసిన తర్వాత భారత క్రికెట్ జట్టు ఆడబోయే తదుపరి సిరీస్ పై ఆసక్తి నెలకొంది. 2025 సంవత్సరం ముగియడానికి రెండు నెలల సమయం ఉంది. ఈ రెండు నెలల్లో టీమిండియా క్రికెట్ షెడ్యూల్ ఎలా ఉందో ఇప్పుడు చూద్దాం.

**సౌతాఫ్రికాతో మూడు ఫార్మాట్ లు:**

ఆస్ట్రేలియాతో సిరీస్ ముగిశాక వారం గ్యాప్ లో ఇండియా సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్ ఆడనుంది. సౌతాఫ్రికా మూడు ఫార్మాట్ లు ఆడడానికి ఇండియాలో పర్యటిస్తుంది. మూడు ఫార్మాట్ లలో టీమిండియా.. సౌతాఫ్రికాతో తలపడనుంది. ఈ సుదీర్ఘ టూర్ లో సౌతాఫ్రికాతో రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్ లు జరుగుతాయి. నవంబర్ 14 నుంచి 18 వరకు తొలి టెస్ట్ న్యూఢిల్లీ వేదికగా అరుణ్ జైట్లీ స్టేడియంలో.. నవంబర్ 22 నుంచి 26 వరకు గౌహతి వేదికగా బర్సపారా క్రికెట్ స్టేడియంలో రెండో టెస్ట్ జరుగుతుంది. ఇప్పటికే ఈ సిరీస్ కోసం ఇరు జట్ల స్క్వాడ్ లను ప్రకటించారు. టెస్ట్ సిరీస్ ముగిసిన తర్వాత ఇండియా మూడు వన్డే మ్యాచ్ ల సిరీస్ ఆడుతుంది. ఈ సిరీస్ కోసం టీమిండియా స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ భారత జట్టులో చేరనున్నారు. వీరిద్దరూ ఇప్పటికే టెస్ట్, టీ20 ఫార్మాట్ కు రిటైర్మెంట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. నవంబర్ 30 న తొలి వన్డే.. డిసెంబర్ 3 న రెండో వన్డే.. డిసెంబర్ 6 న మూడో వన్డే జరుగుతుంది. తొలి మూడు వన్డేలకు వరుసగా రాంచీ, రాయ్‌పూర్,విశాఖపట్నం ఆతిథ్యమిస్తాయి. వన్డే మ్యాచ్ లు మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభమవుతాయి. డిసెంబర్ 9 నుంచి డిసెంబర్ 19 వరకు మొత్తం 5 టీ 20 మ్యాచ్ లు జరుగుతాయి. డిసెంబర్ 9 న కటక్ వేదికగా తొలి టీ20.. డిసెంబర్ 11 న్యూ చండీగఢ్ వేదికగా రెండో టీ20.. డిసెంబర్ 14 న ధర్మశాల వేదికగా మూడో టీ20.. డిసెంబర్ 17 న లక్నో వేదికగా నాలుగో టీ20.. డిసెంబర్ 19న అహ్మదాబాద్ లో ఐదో టీ20 జరుగుతాయి. టీ20 మ్యాచ్ లు రాత్రి 7:00 గంటలకు ప్రారంభమవుతాయి.

## ఐపీఎల్ 2026కి ధోనీ సిద్ధం.. కన్ఫర్మ్ చేసిన CSK సీఈఓ కాశీ విశ్వనాధ్

**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై సూపర్ కింగ్స్, ధోనీ ఫ్యాన్స్ కు గుడ్ న్యూస్. %జూఖ% మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ 2026 ఐపీఎల్ ఆడడం కన్ఫర్మ్ అయింది. సూపర్ కింగ్స్ సీఈఓ కాశీ విశ్వనాథ్ శుక్రవారం (నవంబర్ 7) న ధోనీ 2026 ఐపీఎల్ ఆడతాడని ధృవీకరించినట్టు క్రిక్ బజ్ కన్ఫర్మ్ చేసింది. "తదుపరి సీజన్‌కు అందుబాటులో ఉంటానని %మీ% మాకు చెప్పారు" అని విశ్వనాథ్ చెప్పారు. ఐపీఎల్ 2025 సీజన్ ముగిసిన తర్వాత ధోనీ 2026 ఐపీఎల్ ఆడతాని చెప్పలేదు. పైగా మోకాలి గాయంతో ఆడడంతో 2026 ఐపీఎల్ ఆడే విషయంలో అనుమానాలు నెలకొన్నాయి. సీఈఓ కాశీ విశ్వనాథ్ క్లారిటీ ఇవ్వడంతో ధోనీ ఐపీఎల్ జర్నీ కొనసాగనుంది.

నవంబర్ 15న రిటెన్షన్ గడువుకు ముందే ట్రేడ్ చర్చలు ప్రారంభమయ్యాయి. ఐపీఎల్ 2-026 సీజన్ కోసం ప్రణాళికలు రూపొందించడానికి చెన్నై సూపర్ కింగ్స్ నవంబర్ 10, 11 తేదీలలో ఒక సమావేశాన్ని నిర్వహించనుంది. %జజూ% కాశీ విశ్వనాథ్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ తో పాటు ధోనీ కూడా ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఐపీఎల్ 2025 సీజన్ లో ఋతురాజ్ గాయం కారణంగా టోర్నీ నుంచి మధ్యలోనే తప్పుకోవడంతో మిగిలిన మ్యాచ్ లకు ధోనీ కెప్టెన్సీ చేశాడు. ఐపీఎల్ 2008 లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడుతున్న ధోనీ మధ్యలో రెండు సీజన్ (2016,2017)ల పాటు రైజింగ్ పూణే సూపర్‌జెయింట్ తరపున 30 మ్యాచ్ లు ఆడాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ధోని పెద్దగా రాణించలేదు. ఈ సీజన్ లో మొత్తం 14 మ్యాచ్‌ల్లో 24.50 సగటుతో 196 పరుగులు చేశాడు. 2020లో అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన ధోనీ.. గత సీజన్ లో రుతురాజ్ గైక్వాడ్ కు CSK కెప్టెన్సీని అప్పగించాడు. చెన్నై సూపర్ కింగ్స్ తరపున ధోని 248 మ్యాచ్‌లు ఆడి 4,865 పరుగులు చేశాడు.

జట్టును ఏకంగా ఐదు సార్లు ఛాంపియన్స్ గా నిలిపాడు. 2010, 2011, 2018, 2021, 2023లో చెన్నై జట్టు ఐపీఎల్ టైటిల్ గెలుచుకుంది. ఐపీఎల్ 2026 మినీ వేలానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్ రిటైన్ చేసుకునే ఆటగాళ్లపై దృష్టి పెట్టింది. రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను చర్చించడానికి త్వరలో మహేంద్ర సింగ్ ధోనీతో ప్రస్తుత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ త్వరలో సమావేశం కానున్నారు. రిటైన్ చేసుకునే ఆటగాళ్లపై ఈ ముగ్గురూ చర్చించనుండగా.. తుది నిర్ణయం చెన్నై సూపర్ కింగ్స్ క్రికెట్ లిమిటెడ్

చైర్మన్‌గా నియమితులైన శ్రీనివాసన్ తీసుకుంటారు.ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ ఘోరంగా విఫలమైన సంగతి తెలిసిందే. ఈ సీజన్ లో తొలి మ్యాచ్ గెలిచి శుభారంభం చేసిన చెన్నై.. ఆ తర్వాత ఆడిన 9 మ్యాచ్ ల్లో 8 మ్యాచ్ ల్లో ఓడిపోయింది. ఓవరాల్ గా 14 మ్యాచ్ ల్లో నాలుగు విజయాలతో పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. వచ్చే సీజన్ కోసం మంచి జట్టును తయారు చేస్తాం అని ఐపీఎల్ సమయంలోనే ధోనీ చెప్పాడు.

## రోలెక్స్‌ని జీరోని చేసిన తారక్ కొత్త లుక్







యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఇటీవల రెండు కారణాలతో నిరంతరం చర్చల్లోకొస్తున్నాడు. ఒకటి మారిన అతడి రూపం.. రెండోది కేజీఎఫ్ దర్శకుడు ప్రశాంత్ నీల్ రూపొందస్తున్న డ్రాగన్. అయితే తారక్ మారిన రూపానికి కారణం కూడా డ్రాగన్. ఈ సినిమా కోసం తారక్ తన సర్వస్వాన్ని అర్పిస్తున్నాడు. రేయింబవళ్లు కఠోరంగా మేకోవర్ కోసం శ్రమిస్తున్నాడు. ఇందులో అతడు మాఫియా డాన్‌లకే తాతలా కనిపిస్తాడు! అంటూ ఒకటే గుసగుస వినిపిస్తోంది.

ఏది ఏమైనా తన మేకోవర్ కోసం తారక్ ఎంతగా శ్రమిస్తున్నాడో అతడి వాలకం చెబుతోంది. ఇటీవలి కాలంలో ఎన్టీఆర్ పూర్తిగా సన్నబడిపోయాడు. ముఖాకృతి అనూహ్యంగా మారిపోయింది. ముఖ కవళికల్లో చాలా మార్పు కనిపించింది. అయితే ఇదంతా కఠినమైన డైట్, శారీరక శ్రమ కారణంగా వచ్చిన మార్పు మాత్రమేనని ఫిట్నెస్ ఔత్సాహికులు భావిస్తున్నారు. 6 ప్యాక్, 8 ప్యాక్ వంటివి కావాలంటే దానికోసం కఠిన వ్యాయామం, కఠోరమైన శిక్షణ అవసరం. తిండితో పాటు, నీళ్లను కూడా పరిమితంగా అవసరం మేర మాత్రమే తాగాల్సి ఉంటుంది. అందుకే తారక్ రూపం చూడగానే అభిమానులు కూడా కొంత కంగారు పడిన మాట వాస్తవం. తారక్ మరీ ఇంత సన్నగా మారడంపై కొన్ని సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి.అయితే అతడు పూర్తి ఫిట్ గా ఉన్నాడా లేదా? అనేది అభిమానులు తెలుసుకునేందుకు లేటెస్టుగా ఇంటర్నెట్ లో ఒక ప్రూఫ్ లభించింది. ఇది రేర్ ఫోటోగ్రాఫ్. తారక్ లుక్ ని షేపప్ చేస్తూ సెలబ్రిటీ స్టైలిస్ట్ ఆలిమ్ హకీమ్ చాలా బిజీగా కనిపించగా, దగ్గరుండి మరీ ప్రశాంత్ నీల్ ప్రతిదీ గైడ్ చేస్తూ కనిపించిన రేర్ ఫోటోగ్రాఫ్ నెట్ లో వైరల్ గా మారుతోంది. దీనిని బట్టి ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ జోడీ లుక్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో అర్థమవుతోంది.

ఇప్పుడు మరోసారి తారక్ రూపం ఎలా ఉంటుందో పరిశీలించేందుకు వీడియో రూపంలో మరో ఆధారం అందుబాటులోకి వచ్చింది. ఇది ప్రఖ్యాత %--%రోలెక్స్ వాచ్%--% లేటెస్ట్ వెర్షన్ ప్రచారం కోసం షూట్ చేసిన వీడియో. తారక్ నేరుగా రోలెక్స్ షోరూమ్ కి వెళ్లి యజమానులను అభినందిస్తున్నాడు. అంతేకాదు అతడు తన చేతికి ఒక బ్రాండ్ న్యూ రోలెక్స్ వాచ్ ని ధరించాడు. ఈ వాచ్ ఖరీదు 2 కోట్లు పైమాటే. అయితే ఈ ఎపిసోడ్ లో కూడా రోలెక్స్ కంటే తారక్ రూపమే అందరి దృష్టిని ఆకర్షించింది. ఎన్టీఆర్ చూడటానికి సన్నగా కనిపిస్తున్నా కానీ, అతడి నిజ రూపం ఎలా ఉందో తెలియాలంటే ఓపెన్ బాడీని ప్రదర్శించాలి. అయితే షర్ట్ ఉన్నా కానీ, అతడి బాడీ పూర్తిగా రాటు దేలి షేపప్ అయ్యి కనిపిస్తోంది. ఫిజికల్ గా అతడు ఎలా ఉన్నాడో తెలియాలంటే షర్ట్ విప్పి చూపించాలి. కానీ ఆ పని అతడు తెరపై చేస్తాడేమో కానీ, ఇప్పుడు ఓపెన్ గా చూపించడు. మొత్తానికి తారక్ మేకోవర్ మరోసారి ఇంటర్నెట్ లో పెద్ద డిబేట్ కి తెర తీసింది.తారక్ ని బీస్ట్ మోడ్ లో జ్వలింపజేస్తామని ప్రశాంత్ నీల్ పదే పదే చెబుతున్నాడు. దానికోసం అతడిని తీవ్రంగానే శ్రమ పెడుతున్నాడని అర్థమవుతోంది. ఇక దేవర తర్వాత వార్ 2 షాకిచ్చింది. అందుకే మరో పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ కోసం తపిస్తున్న తారక్ కూడా ఎక్కడా హార్డ్ వర్క్ విషయంలో తగ్గడం లేదు. ఎన్టీఆర్- నీల్ ప్రాజెక్ట్ %-%డ్రాగన్%-% కోసం మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్ ని వెచ్చిస్తున్న సంగతి తెలిసిందే. నాగార్జున కల్ట్ క్లాసిక్ %- శివ%-% రీరిలీజ్ వెనక బృందాన్ని అభినందిస్తూ ఒక వీడియోలో కనిపించినప్పుడు తారక్ కొత్త లుక్ మొదట అందరి దృష్టిని ఆకర్షించింది. అభిమానులు అతడి సన్నని రూపాన్ని చూసి ఆశ్చర్యపోయారు. ఎన్టీఆర్ తన పాత లుక్‌ని, బలాన్ని తిరిగి పొందాలని పలువురు వ్యాఖ్యానించారు. కానీ తారక్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ తో తన తదుపరి చిత్రంపైనే ఎక్కువగా ఫోకస్ చేసాడు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com